Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 184 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 జూలై 2023 మంగళవారం పేజీలు : 4

## మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు

సుర్గుజా (ఛత్తీస్‌గఢ్): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ మరో సారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మతంతో సంబంధం లేకుండా భారతదేశంలోని ప్రజలందరూ హిందువులే అని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుర్జుగాలోని అంబికాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. “భారత ప్రజలందరూ హిందువులే. భారతదేశాన్ని తన మాతృభూమిగా భావించేవాడు హిందువు. అది ఏ మతాన్ని అనుసరించే వ్యక్తి అయినా, ఎలాంటి దుస్తులు ధరించే వ్యక్తి అయినా. ఇది నిజం సంఘ్ ఈ సత్యాన్ని చెబుతోంది. వందల సంవత్సరాలుగా మనం ఐక్యంగా ఉండడమే దీనికి కారణం” అని భగవత్ చెప్పారు. ‘రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను అర్థం చేసుకోవడానికి సంఘ్‌లో చేరడం ఉత్తమ మార్గం. శాఖకు రావడం ద్వారానే సంఘ్ గురించి తెలుసుకోవచ్చు. సంఘ్ శాఖకు రావడానికి ఎలాంటి రుసుం లేదు, రుచి చూస్తేనే మాధుర్యం తెలుస్తుంది” అని ఆయన పేర్కొన్నారు.

# కొత్త బిల్లులు లేనట్లే!

## సవరణలకే పరిమితమా!?



### ఆగష్టు 2వ వారంలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఆగస్టు రెండో వారంలో జరిగే అవకాశం కనిపిస్తుంది. తెలంగాణలో మరికొద్దిరోజుల్లో ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ అసెంబ్లీ సమావేశాలలో కొత్త బిల్లులను ప్రవేశ పెట్టకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉన్న చట్టాలను సవరించడానికి సవరణ బిల్లులను ప్రవేశపెట్టడం పైన దృష్టి సారించనున్నట్టు తెలుస్తుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అసెంబ్లీని సమావేశపరచాలని రాజ్యాంగ నిబంధనను అనుసరిస్తూ తెలంగాణాలో శాసనసభ సమావేశాలు జరగనున్నాయి. అయితే ఈ శాసనసభ సమావేశాలలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించనుంది. మొదట ఈ శాసనసభ సమావేశాలలో నూతన క్రీడా విధానాన్ని ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, ప్రస్తుతానికి దానిని పక్కనపెట్టి సాంఘిక సంక్షేమం, అటవీ, పురపాలక, విద్యా శాఖలకు సంబంధించిన చట్టాల సవరణ పై ప్రధానంగా దృష్టి సారించనున్నారని సమాచారం. రాష్ట్రంలో గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ కు , ప్రభుత్వానికి ప్రభుత్వ బిల్లుల ఆమోదంపై విభేదాలు తలెత్తిన నేపథ్యంలో కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి బదులుగా ఇప్పటికే ఉన్న చట్టాలను సవరించడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతుంది.

గత ఏడాదికాలంగా ప్రభుత్వం ప్రతిపాదించిన అనేక బిల్లులపై గవర్నర్ తమిళి సై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రైవేటు యూనివర్సిటీల బిల్లు , ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో నియామకాలకు కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు బిల్లు, మునిసిపల్ చట్టాల సవరణ బిల్లు, మెడికల్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును పెంచే బిల్లు కూడా గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేసిన బిల్లులలో ఉన్నాయి. దీంతో కొత్త బిల్లులను ప్రవేశపెట్టే బదులు సవరణల పైన దృష్టి సారించినట్టు తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికలకు ముందు జరుగుతున్న వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు కీలక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇవి తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి, అనేక చర్చలకు వేదిక కానున్నాయి. మరి ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు ఎలా ఉంటాయి అన్నది మాత్రం ఆసక్తికరమే.

## అక్టోబర్‌లో గ్రూప్-3 పరీక్ష..

### వారం, పది రోజుల్లో తేదీల ప్రకటన..!

హైదరాబాద్ : గ్రూప్–3 పరీక్ష అక్టోబర్ నెలలో నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించినట్టు సమాచారం. ఈ విషయమై కమిషన్ కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే రెండు, మూడుసార్లు చర్చించి, ఎన్నికలకు ముందే పరీక్ష నిర్వహించాలనే అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్టు సమాచారం. మరో వారం, పది రోజుల్లో గ్రూప్–3 పరీక్ష తేదీలను




కమిషన్ ప్రకటించనున్నట్టు తెలిసింది. అక్టోబర్ నెలలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఐబీపీఎస్‌తోపాటు మిగతా పరీక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని పరిగణనలోకి తీసుకొని గ్రూప్–3 పరీక్ష తేదీలను పరిశీలిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అక్టోబర్ రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించాలని కమిషన్ భావిస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నికలలోపే పరీక్షలన్నీ పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 105 విభాగాల్లో గ్రూప్–3 క్యాటగిరీలో 1,363 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఒక్కో ఉద్యోగానికి సగటున 394 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

# తెలంగాణకు ఆంధ్రా నేతల అవసరం ఏమొచ్చింది..?

### ‘నల్లారి’ రాకపై కమలం పార్టీలో విబేధాలు..! - ఏపీ నేతల పెత్తనమేంటంటూ బహిరంగ విమర్శలు

హైదరాబాద్ : కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం బీజేపీలో కొత్త కలకలాన్ని రేపింది. తమది ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అని చెప్తూ వచ్చిన బీజేపీ ఒక్క సభతో ఆ అర్హత కోల్పోయింది. కాంగ్రెస్ తరహాలో బీజేపీ నేతలు బహిరంగంగా నోరు జారడమే ఇందుకు కారణం. ఈ మంటకు ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాక మరింత ఆజ్యం పోసింది. తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఆయనను కిషన్ ప్రమాణ స్వీకారానికి ఎలా తీసుకొస్తారంటూ పలువురు నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర బీజేపీలో బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య వైరం నడుస్తున్నది. దాన్ని కవర్ చేసేందుకు బండి కొన్నాళ్ళు ప్రయత్నించినప్పటికీ చాప కింద నీరులా ఆయన పదవికే ఎసరు పెట్టింది. దీంతో బండికి మైండ్ బ్లాంక్ అయినట్టు బీజేపీ నేతలు చెప్తున్నారు. ఇన్నాళ్లూ తాను కౌంటర్ ఇవ్వకుండా పెద్ద తప్పు చేశానని బండి భావించాడని, అందుకే కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం రోజు ‘ఢిల్లీకి ఫిర్యాదులు చేయడం ఆపేయండి’ అంటూ ఈటల వర్గానికి కౌంటర్ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. ‘కిషన్‌రెడ్డినైనా ప్రశాతంగా పనిచేసుకోనీయండి’ అంటూ బండి వ్యాఖ్యానించడం ద్వారా ఇన్నాళ్లూ



తనను ఈటల ఎంత ఇబ్బంది పెట్టారో చెప్పారని, దీంతో ఈటలపై కార్యకర్తల్లో ఉన్న కోపం మరింత పెరిగిందని అంటున్నారు.

వరాయి పార్టీ నుంచి వచ్చి రాష్ట్ర బీజేపీని ఆక్రమించుకున్నాడంటూ కొందరు ఈటలపై మండిపడుతున్నారు. ఇక కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారంలో పలువురు బీజేపీ నేతలు ఆయనను వదిలేసి బండి సంజయ్ భజన చేశారు. దీంతో బీజేపీలో క్రమశిక్షణ ఖతమైనట్టేనని, మున్ముందు ఆ పార్టీలో కాంగ్రెస్ తరహా రాజకీయాలు చూస్తామని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**కిరణ్ ఎందుకు వచ్చాడు? :** ‘తెలంగాణకు రూపాయి ఇవ్వను. ఏం చే సుకుంటారో చేసుకోండి’ అంటూ అసెంబ్లీ సాక్షిగా వివక్ష చూపిన అప్పటి సీఎం కిరణ్‌కుమార్ తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయం అందరికీ తెలుసు. అలాంటి వ్యక్తి కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి రావడాన్ని, స్పీచ్ ఇవ్వడాన్ని బీజేపీలో అనేక మంది జీర్ణించుకోలేకపోతున్నారు. తెలంగాణకు ఆంధ్రా నేతల అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

విజయశాంతి ఏకంగా ‘తెలంగాణ వ్యతిరేకులు ఉన్న చోట ఉండలేక వెళ్లిపోయాను’ అంటూ బహిరంగంగా తన అసంతృప్తిని వెళ్లగక్కారు. చాలా మంది నేతలు కిరణ్ రాకను వ్యతిరేకిస్తున్నారు. కిషన్‌రెడ్డితోపాటు బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, తరుణ్ చుగ్, లక్ష్మణ్, బండి తదితర నేతలతో బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలోనూ పలువురు నేతలు కిరణ్‌ను ఎందుకు పిలిచారని ప్రశ్నిస్తూ.. ‘ఆంధ్రా నేతల పెత్తనం వద్దు’ అని స్పష్టంగా చెప్పినట్టు సమాచారం.




## ఉభయ సభల్లో వాయిదాల పర్వం

# పార్లమెంట్‌ను కుదిపేస్తోన్న ‘మణిపూర్ మంటలు’

దిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అంశంపై ప్రధాని ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తుండటంతో ఈ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీనిపై చర్చకు తాము సిద్ధమేనని కేంద్రం ప్రకటించినప్పటికీ.. చర్చకు ముందే ప్రధాని ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే.. విపక్ష పార్టీలు లోక్‌సభలో ప్లకార్డులతో దర్శనమిచ్చాయి. ‘ఇండియా ఫర్ మణిపూర్’, ‘మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలి’ అంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనల మధ్యే ఉభయ సభలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. రూల్ 176 కింద చర్చ జరపాలని 11 నోటీసులు, రూల్ 267 కింద చర్చ జరపాలని 27 నోటీసులు అందాయని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. అలాగే పశ్చిమ్ బెంగాల్‌లో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో చెలరేగిన హింసపై చర్చించాలంటూ భాజపా ఎంపీలు నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో ఎగువ సభ సభ్యులను ఉద్దేశించి ధన్‌ఖడ్ మాట్లాడుతుండగా.. విపక్ష ఎంపీలు వారి సీట్లలో నుంచి లేచి నిలబడ్డారు. దీనిపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ..‘డెరెక్ ఒబ్రెయిన్ దయచేసి మీరు సీట్లో కూర్చోండి. మీరు ఛైర్మన్ కుర్చీకే సవాలు విసురుతున్నారు’ అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొనడంతో సభ వాయిదా పడింది. సభ కార్యకలాపాలకు ముందు అధికార, ప్రతిపక్ష పార్టీలు గాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపాయి. ఇరు పార్టీల ఎంపీలు మహిళలపై జరుగుతోన్న నేరాల గురించి చర్చించాలని డిమాండ్ చేశాయి. రాజస్థాన్‌లో మహిళలపై జరుగుతోన్న నేరాలపై పార్లమెంట్‌లో చర్చించాలని, వెంటనే అశోక్ గహ్లోత్ ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలిన ఆ రాష్ట్ర భాజపా ఎంపీలు గాంధీ విగ్రహం చెంత నిరసన వ్యక్తం చేశారు.

మణిపూర్ వైరల్ వీడియోపై ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే మాట్లాడుతూ.. ‘ఇది మహిళలకు సంబంధించిన అంశం. రాష్ట్రాల



మధ్య పోటీకి సంబంధించిన విషయం కాదు. అలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా నేరమే’ అని అన్నారు.

‘మణిపూర్ అంశంపై అంతర్జాతీయంగా చర్చ జరుగుతున్నా.. దేశంలో మాత్రం చర్చించే పరిస్థితి లేదు’ అంటూ ఎస్పీ ఎంపీ జయా బచ్చన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గరుడ వార్త



## సంపాదకీయం

### సోనియా.. వ్యూహాలు మారుతున్నాయా?

జాతీయ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితిలోనూ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారును పక్కన పెట్టి తాము జెండా ఎగరేయాలని.. భావిస్తున్న కాంగ్రెస్ ఈ క్రమంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్.. ఉరఫ్ పీకేను పార్టీలో చేర్చుకునేందుకు నిర్ణయించుకుంది. దీనికి తగిన ముహూర్తం కూడా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కాంగ్రెస్కు వచ్చే ఎన్నికల్లో లక్ష్యాలను కూడా పీకే నిర్ణయించారు. 370 నుంచి 400 స్థానాలు లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగాలని ఆయన నిర్దేశించారు. అయితే..ఈలోగానే సోనియాతో పీకే వరుస భేటీలు.. ఆసక్తిగా మారాయి. ఒకవైపు ప్రాంతీయ పార్టీల కూటములు రెడీ అవుతున్ననేపథ్యంలో మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ కూడా .. మరింత పుంజుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడం జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా మహారాష్ట్రకు చెందిన శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సైతం బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించి జాతీయ రాజకీయాలపై చర్చించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపత్యంలో కాంగ్రెస్ మరింతగా తన వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీని బలోపేతం చేసి 2024 ఎన్నికలకు సన్నద్ధం అయ్యేలా సోనియా గాంధీ పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలోనే సోనియా పీకేతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులతో భేటీ అయిన ప్రశాంత్ కిషోర్.. ఆ సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికలపై తాను రచించిన ప్రణాళికలను పార్టీ నేతలతో పంచుకున్నారు. అదే సమయం లో తాను కాంగ్రెస్ లో చేరే అంశాన్ని కూడా సీనియర్ నాయకుల వద్ద ప్రస్తావించారు. దీంతో మళ్లీ వారం పది రోజుల వరకు మళ్లీ ఎలాంటి మీటింగు ఉండదని అనుకున్న తరుణంగా.. అనూహ్యంగా సోమవారం సోనియా ఆధ్వర్యంలో మరోసారి పార్టీ సినియర్ క్యాడర్ తో భేటీ జరిగింది. దీనికి కూడా పీకే వచ్చారు. ఈ క్రమంలో ఈ ఏడాది చివరలో జరగనున్న గుజరాత్ హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలకు వ్యూహరచన చేసినట్లు తెలిసింది. ఢిల్లీలో సోనియా నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కెసి వేణుగోపాల్ అంబికా సోని ప్రియాంక గాంధీ వాద్రా ముకుల్ వాస్నిక్ జైరాం రమేష్ పి చిదంబరం రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు హాజర య్యారు. నాలుగు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో రానున్న ఎన్నికల వ్యూహం లోని వివిధ కోణాలపై నేతలు చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆచితూచి వ్యవహరించాలని చెప్పుకొచ్చిన ప్రశాంత్ కిషోర్ ముందుగా పార్టీకి బలం ఉన్న నియోజకవర్గాల్లోనే అభ్యర్థులను బరిలో దించాలని ప్రతిపాదించారు. తద్వారా ఆయా అభ్యర్థులు గెలిస్తే ఆ విజయం తాలూకు ప్రభావం ఇతర ప్రాంతాల్లోనూ కనిపిస్తుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. మొత్తానికి కాంగ్రెస్ గతానికి భిన్నంగా దూసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

## మహిళలే అధికం..



ఖమ్మం : ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం ముగియటంతో జిల్లా ఎలక్టోరల్ రోల్ అధికారి అయిన కలెక్టర్ గౌతమ్ ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. ఆయా నియోజకవర్గాల్లోని 1439 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను బీఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఎవరైనా పరిశీలించుకునే అవకాశం కల్పించారు. గత నవంబరు నుంచి ఓటర్ల జాబితా సవరణకు అనువుగా ఓటు నమోదు, తొలగింపు, మార్పులకు దరఖాస్తులు స్వీకరించారు. అందిన దరఖాస్తులు పరిశీలించిన అనంతరం అర్హులకు ఓటు హక్కు కల్పించి జాబితాలో చోటు కల్పించారు. కలెక్టర్ ప్రకటించిన తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 11,53,987 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో మహిళలు అత్యధికులున్నారు. పురుషులు 5,62,623, మహిళలు 5,91,290, థర్డ్ జెండర్స్ 74 మంది నమోదయ్యారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. నమోదైన వారిలో ప్రవాస భారతీయ 143, సర్వీస్ ఓటర్లు 680 మంది ఉన్నారు. కొత్తగా 37,193 మంది ఓటర్లను నమోదు చేసి, 8,027 మంది ఓటర్లను తొలగించినట్లు నివేదికలో పేర్కొన్నారు. సంక్షిప్త సవరణకు ముందు గత నవంబరు 9న ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం 11,24,821 మంది ఓటర్లు ఉండగా తాజాగా ప్రకటించిన తుది జాబితా ప్రకారం 11,53,987 మంది ఓటర్లున్నారు. దీంతో జిల్లాలో 29,166 మంది పెరిగారు.

పార్టీలకు జాబితాల పంపిణీగుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ తన మందిరంలో సమావేశం నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా వివరాలు వెల్లడించారు. అయిదు నియోజకవర్గాల వివరాలు పెన్‌డ్రైవ్‌లో వారికి అందించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు విద్యాసాగర్, ఉపేంద్ర సాహు, నర్సింహారావు, ప్రకాశ్, హుస్సేన్, విజయ్, కృష్ణచైతన్య, కృష్ణమోహన్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. శతాధిక ఓటర్లు 180 మందిజిల్లాలో వందేళ్లు నిండిన ఓటర్లు 180 మంది నమోదయ్యారు. ఖమ్మంలో 33, పాలేరు 13, మధిర 54, వైరా 47, సత్తుపల్లిలో 33 మంది శతాధిక వృద్ధ ఓటర్లున్నారు. 18–19 ఏళ్ల వయసున్న యువ ఓటర్లు జిల్లాలో 20,066 మంది నమోదయ్యారు.

## 'శుద్ధ' అబద్ధమే!



భూపాలపల్లి : జిల్లాలో అనుమతులు లేకుండా ఆర్వో ప్లాంట్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేసి ప్రమాణాలు లేని నీటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఒక్కప్పుడు పట్టణంలో ఒకటి రెండు ఉండేవి.. గ్రామాల్లో అసలే కనిపించకపోయేవి. అలాంటిది వీధివిధీనా వెలిశాయి. ఐఎస్ఐ అనుమతులు పొందకుండానే నీటి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుద్ధ జలం పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు.

భూపాలపల్లి పట్టణంతో పాటు గ్రామాల్లో నీటి శుద్ధి ప్లాంట్లు ఇష్టానుసారం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 192 ఆర్వో ప్లాంట్లు ఉండగా అన్ని రకాల అనుమతులు పొందినవి సుమారుగా మూడు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. మిగతావి అనధికారికంగా ఏర్పాటు చేసుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు లేకుండా, అనుమతి పత్రాలు పొందకుండా.. అపరిశుభ్రత, క్యాన్లలో పేరుకుపోయిన నాచుతో తాగునీరు సరఫరా చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇళ్ల మధ్యన ఉన్న బోరు బావుల నుంచి వాణిజ్య అవసరాలకు నీటిని వినియోగించుకోవడానికి వీల్లేదు. వాల్టాచట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ఆర్వో ప్లాంట్లు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి.

తాగునీటి పేరిట దందా

ఎండాకాలంలో కొన్నిచోట్ల మున్సిపల్, ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తీసుకొని ఈ నీటినే శుద్ధి చేసి క్యాన్(డబ్బా) నీళ్లు అమ్ముకుంటున్నారు. ఎక్కడైనా బోరు వేస్తే నీళ్లు బాగా పడితే చాలు రూ. 2.50 లక్షల నుంచి రూ. 5లక్షలు ఖర్చు చేసి ఆర్వో కేంద్రాన్ని పెట్టేయడం, వ్యాపారం చేయడం ఇటీవల సాధారణమైంది.

వాస్తవంగా ఐ.ఎస్.ఐ అనుమతులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకుంటే రూ. 18 లక్షల నుంచి రూ. 25లక్షల వరకు ఖర్చు చేయాలి. ప్రతి మూడు నెలలకోసారి ఉన్నతస్థాయి అధికారులు తనిఖీలు చేసి పరిశీలిస్తారు. గడువు ముగిసిన తర్వాత మళ్లీ దరఖాస్తు చేసేందుకు రూ. 2 లక్షలు ఖర్చవుతోంది. ఆ సమయంలో ఎలాంటి తేడాలు వచ్చినా ప్లాంట్ మూసి వేయడమే.

అనధికారికంగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలు మూడేళ్లలో పట్టణంలో ఆర్వో కేంద్రాలు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల ట్యాంకులు ఏర్పాటు చేసి అమ్ముతుండగా మరికొన్ని ప్రాంతాల్లో ఆటోలకే ప్లాస్టిక్ ట్యాంకులు పెట్టి నీటి దందా చేస్తున్నారు.

వ్యాపార కేంద్రాలకు ఒక్కో క్యాన్‌కు రూ. 10, ఇళ్లకు రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారు రూ. 22లక్షల వ్యాపారం సాగుతోంది.

నిర్వహణకు ఇవి అవసరం

ఐఎస్ఐ సర్టిఫికేషన్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)లి చిన్న తరహా పరిశ్రమల ద్వారా రిజిస్ట్రేషన్‌లి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్‌లి నీటి నాణ్యత ధ్రువీకరణ పత్రాలు లి కెమిస్ట్ మైక్రోబయోలాజి ల్యాబ్ ధ్రువీకరణ పత్రంలి పెస్ట్ కంట్రోల్ సర్టిఫికెట్ నిబంధనలకు నీళ్లొదిలారు..

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, కోర్లిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు. అందుకే ప్లాంటులో కెమికల్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి కెమిస్టు, మైక్రో బయోలజిస్టులను నియమించుకోవాలి. వీరు ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటిలోని కాఠిన్యత, లవణాలు, రంగు, రుచి పరీక్షించాకే విక్రయానికి పంపించాలి. కానీ ఇవేవీ జరగడం లేదు. బోరు నీటిని ఫిల్టర్ చేశాక వాసన లేకుండా, రుచి ఉండేలా రసాయనాలు కలుపుతున్నారు. ఫలితంగా మినరల్స్ పూర్తిగా పోతున్నాయి. ఈ నీటిని తాగే జనం రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని, కాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు పేర్కొన్నారు. ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపాలిటీలు ఆ వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ అవినాశ్‌ను వివరణ అడగగా.. వాటర్ ప్లాంట్లను ఆహార తనిఖీ, కల్తీ నిరోధక శాఖ వారు పర్యవేక్షిస్తారని, వారే తనిఖీ చేస్తారని తెలిపారు. తాము ట్రేడ్ లైసెన్స్ ఇస్తామని చెప్పారు.

చర్యలు చేపడతాం..–అమృతశ్రీ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

అనుమతులు పొందకుండా ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తే చర్యలు చేపడతాం..చాలా వాటికి ఐఎస్ఐ అనుమతుల్లేవని నా దృష్టికి వచ్చింది.. నీటి శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తాం. నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. ప్లాంట్లను సీజ్ చేస్తాం.

## బస్తాల్లో బియ్యం తగ్గుతోంది.!

మహబూబాబాద్ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి పంపే బియ్యం తూకంలో తేడా ఉంటోంది.. ఈ సమస్య జిల్లాలోని అన్ని బడుల్లోనూ ఎదురవుతోంది. ప్రతి నెల సుమారు 1200 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఎంఎల్ఎస్ గోదాముల నుంచి ఉపాధ్యాయులే సొంత ఖర్చులతో బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. 50 కిలోల చొప్పున 2400 బస్తాలను అందిస్తున్నారు. 50 కిలోల చొప్పున లెక్కగట్టి రశీదు ఇస్తున్నా.. ఒక్కో బస్తాలో 2 నుంచి 4 కిలోల తరుగు వస్తోంది. దీనిని భర్తీ చేసేందుకు తంటాలు పడాల్సివస్తోందని ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. తరుగు వస్తున్న బియ్యం అసలు గోదాంలో ఉంటున్నాయా..నల్లబజారుకు తరులుతున్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మహబూబాబాద్ మండలం ముడుపుగల్ ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేసే బియ్యం బస్తాలో 50 కిలోలకు బదులు 47.62 కిలోలు మాత్రమే ఉన్నాయి. 2.36 కిలోల తరుగు చూపిస్తోంది. ఇంకా తూకం వేయని బస్తాలు కూడా ఉన్నాయి. వాటిలో కొన్నింట్లో మూడు నుంచి నాలుగు కిలోల తరుగు ఉండే అవకాశాలున్నాయి. కాగా ముడుపుగల్ బడిలో 140 మంది విద్యార్థులు ఉన్నారు. రోజూ సుమారు 120 మంది పిల్లలు హాజరవుతున్నారు. ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల చొప్పున భోజనం అందించాలి. వీరికి నెలకు 2.50 క్వింటాళ్ల బియ్యం అవసరం. ఇందులో 10 నుంచి 20 కిలోల తరుగురావడం వల్ల పాఠశాలకు 2.40 క్వింటాళ్ల నుంచి 2.30 క్వింటాళ్ల బియ్యమే అందుతున్నాయని ప్రధానోధ్యాయుడు వీరారెడ్డి పేర్కొంటున్నారు.

తూకం వేసి ఇవ్వాలి

గోదాముల వద్ద తూకం వేయడం లేదు. 50 కిలోల బస్తా కావడంతో దాన్నే పరిగణనలోకి తీసుకొని బస్తాల లెక్క చొప్పున సరఫరా చేస్తున్నారు. దీంతో నష్టం వాటిల్లితోందని.. ఆడిట్ సమయంలో 50 కిలోల ప్రకారం లెక్కలు చూపించేందుకు సర్దుబాటు చేస్తున్నారు. తరుగు వస్తుందని.. లెక్క ప్రకారం ఇవ్వాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈవోల సమక్షంలోనే అందిస్తున్నాం– కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ఎంఈవోల సమక్షంలోనే లారీని వే బ్రిడ్జి తూకం వేస్తున్నాం. అప్పుడు వేలిముద్ర తీసుకుంటాం. ఆ తరువాతనే ఉపాధ్యాయులకు బస్తాల లెక్కన అందిస్తున్నాం. బయటకు వెళ్లిన తరువాత తక్కువ వస్తున్నాయంటే మేము ఏం చేయలేం.

## వరి వైపే అడుగులు

నల్గొండ : యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం (జనవరి 4) నాటికి 1.68 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. గత నెలతో పోలిస్తే వరి నాట్లు ప్రస్తుతం పుంజుకున్నాయి. మొత్తం 1.68 లక్షల ఎకరాల్లో 1.5 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో అన్ని పంటల సాగు విస్తీర్ణం 8.71 లక్షల ఎకరాలకు గానూ ఇప్పటి వరకు 20 శాతం మేర పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ ఎడమ కాల్వతో పాటూ ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ), మూసీ, డిండి ప్రాజెక్టుల కింద నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో ఈ నెలాఖరు నాటికి ఆయకట్టుతో పాటూ ఉమ్మడి జిల్లాలో వరినాట్లు చివరి దశకు చేరుకోనున్నాయి. ఈ సీజన్‌లో



ప్రాజెక్టుల కిందనే సుమారు 5.5 లక్షల ఎకరాలకు ప్రభుత్వం సాగునీరు అందిస్తోంది. ఇప్పటికే బోరు, బావుల కింద వరినాట్లు తుది దశకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే నాగార్జునసాగర్‌లోనూ నీటిమట్టం ఆశాజనకంగానే ఉంది. మరోవైపు నూనెగింజల సాగు ఏటేటా తగ్గిపోతోంది. మూడు జిల్లాల్లోనూ ప్రస్తుతం 16 వేల ఎకరాల్లో మాత్రమే నూనెగింజలను రైతులు సాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన భూగర్భజల లభ్యత గతేడాదితో పోలిస్తే సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో భూగర్భ జల లభ్యత పెరగ్గా, నల్గొండ జిల్లాలో స్వల్పంగా తగ్గింది. చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటల్లోనూ పుష్కలంగా నీళ్లు ఉండటంతో వీటి కింద వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 10 శాతం వరకు పెరిగింది. గతేడాది యాసంగిలో వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంతో మూడు జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. ఈ దఫా యాసంగి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటించడంతో ఈ మేరకు ఈ సీజన్‌లో వరి విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## అడుగు దూరంలో కొలువు

కరీంనగర్ : పోలీసు కొలువును గెలవాలని ఏడాదిగా శ్రమించిన యువత కొందరు విజయం దిశగా అడుగులేస్తున్నారు.. అన్ని రకాల పరీక్షలను మొక్కవోని దీక్షతో అధిగమించి కోరుకున్న కొలువును అందుకునేందుకు అడుగు దూరంలో నిలబడి ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూనిఫాం కొలువులైన ఎస్సై, కానిస్టేబుల్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని పలు ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు కుర్రకారు ఉవ్విళ్లూరుతున్నారు..

ఇటీవల కరీంనగర్ పోలీసు శిక్షణ కేంద్రం (పీటీసీ)లో ముగిసిన యూనిఫామ్ ఉద్యోగుల దేహదారుఢ్య పరీక్షల్లో 59.94 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. కరీంనగర్ కేంద్రాన్ని ఆప్షన్‌గా పెట్టుకున్న వీరిలో దాదాపుగా 80 శాతం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులే ఉన్నారు. 21,972 మంది ఇక్కడికి రావాల్సి ఉండగా.. ఇందులో 19,210 మంది పరుగు సహా ఇతర పోటీలకు హాజరయ్యారు. 2,762 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా పరీక్షలన్నింటిలో 11,515 మంది అర్హత సాధించగా.. 7,695 మంది అర్హత సాధించలేకపోయారు.

గట్టిపోటీ తప్పదూ..!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్సై ప్రాథమిక పరీక్షకు 21,801 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 20,661 మంది పరీక్షను రాశారు. 1,140 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షకు 52,569 మంది అర్జీ పెట్టుకుని 49,145 మంది హాజరయ్యారు. 3,514 మంది పరీక్షని రాయలేకపోయారు. ఎస్సై పరీక్షను రాసినవారంతా కానిస్టేబుల్ పరీక్షను రాశారు. అంటే దాదాపుగా నాలుగు జిల్లాల పరిధిలో ఈ యూనిఫాం పోస్టుల కోసం 49 వేల మంది ప్రాథమిక పరీక్షకు విచ్చేశారు. ఇందులో దారుఢ్య పరీక్షలకు 21వేల మందికిపైగా పాల్గొని లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగు పందెంలో పాల్గొని 11,515 మంది అర్హులుగా మారారు. కొలువును గెలవాలనుకున్న అభ్యర్థుల్లో దాదాపుగా 25 శాతానికిపైగా మాత్రమే తుది పరీక్షను రాసేందుకు అర్హత సాధించారు. వీరంతా ఈ ఏడాది మార్చి 12 నుంచి ఏప్రిల్ 23 వరకు నిర్వహించే ప్రధాన రాత పరీక్షకు హాజరవనున్నారు. అందులో మంచి మార్కులతో అగ్రపథాన నిలిచినవారంతా పోలీసు ఉద్యోగాన్ని దక్కించుకోనున్నారు. ఉన్న ఒక్క పోస్టుకు సగటున 30 మంది పోటీ పడాల్సి వస్తుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాంటింజియస్ డిస్ట్రిక్ట్ కేడర్–1 (ప్రత్యేక పోలీసు బలగాల విభాగం)లో 17 జిల్లాల పరిధిలో ఉన్న 2,489 పోస్టులకు కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు ఉద్యోగావకాశాన్ని అందుకోవచ్చు. ఇవి కాకుండా జోన్‌ల పరిధిలో ఇంకొన్ని ఉద్యోగావకాశాలున్నాయి. కేవలం ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాల వారీగా మాత్రం 1,196 ఉద్యోగాలకు అభ్యర్థులు పోటీపడుతున్నారు.

బాసర జోన్ పరిధిలో జగిత్యాల, కాళేశ్వరం జోన్ పరిధిలో పెద్దపల్లి, రాజన్న జోన్ పరిధిలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలున్నాయి. ఎస్సై పోస్టుల కోసం జోన్‌ల వారీగా ఆశావహులు తమ అదృష్టాన్ని ప్రధాన పరీక్ష రూపంలో పరీక్షించుకోబోతున్నారు. దారుఢ్య పరీక్షలో అర్హత సాధించిన వారిలో ఎస్సై, కానిస్టేబుల్ రెండు కొలువుల కోసం కష్టపడే యువత అధికంగా ఉన్నారు.

ఎస్సై ఉద్యోగాలు కాళేశ్వరం జోన్ పరిధిలో 33, బాసర జోన్ పరిధిలో 39, రాజన్న జోన్ పరిధిలో 43 పోస్టులు మాత్రమే ఉండటంతో అభ్యర్థులకు సవాలు తప్పడం లేదు. తక్కువ పోస్టులుండటంతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాత పరీక్షను మంచి మార్కులతో గట్టెక్కితే ఇష్టపడిన పోలీసు యూనిఫామ్ ఒంటి మీద చేరే అవకాశం ఉంటుంది.

# ఏడేళ్లుగా అదే తీరు..!

ఖమ్మం :పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2016 అక్టోబర్ 18న ఏడు కొత్త మండలాలను ఏర్పాటుచేసింది. పాత మండల కేంద్రాలకు ఆమడదూరంలో ఉంటూ అనేక సమస్యలకు నెలవైన ప్రాంతాలను అభివృద్ధిపరచాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. దాదాపు ఏడేళ్లు అవుతున్నా పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ ప్రభుత్వ కార్యాలయాలు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రజలకు దూరభారం తగ్గించి మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, భద్రాద్రి జిల్లాలో ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కరకగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. ఒకట్రెండు మినహా మిగతా ప్రధాన శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో మరికొన్ని తాత్కాలికంగా సేవలు అందిస్తున్నాయి. అరకొర వసతులతో విధి నిర్వహణకు అధికారులు, సిబ్బంది, సేవలు పొందే క్రమంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా మండలాల వాసులు కోరుతున్నారు.

ఇదిగో సమస్యల చిట్టా.. రఘునాథపాలెంలో ఠాణా, తహసీల్ కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండ్రోజుల్లో వీటిని ప్రారంభించనున్నారు. వ్యవసాయశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. ఆళ్లపల్లిలో పశు వైద్యశాల భవనంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. కొమ్ముగూడెం అంగన్‌వాడీ భవనంలో సెర్ప్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో సేవలందటం లేదు. విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. కేజీబీవీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. ఎంపీడీఓ, సెర్ప్, వ్యవసాయశాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. లక్ష్మీదేవిపల్లిలో అద్దె భవనంలో తహసీల్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతోంది. రామచంద్ర కళాశాల భవనంలో ఠాణా సేవలు అందుతున్నాయి. ఠాణా కొత్త భవన నిర్మాణం తుది దశకు చేరింది. విద్యాశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. చుంచుపల్లిలో సింగరేణి భవనంలో తహసీల్ కార్యాలయం, జడ్పీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తికాలేదు. సుజాతనగర్ మండలంలో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాల భవనంలోనే కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. సెర్ప్, విద్య, వ్యవసాయ శాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. కరకగూడెంలో శిథిలావస్థకు చేరిన పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, సెర్ప్ కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. అన్నపురెడ్డిపల్లిలో ఠాణా, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలోని క్వార్టర్స్‌లో కొనసాగుతున్నాయి.

# నైపుణ్య వికాసం.. ఉపాధికి ఊతం

ఖమ్మం : నేటి పోటీ ప్రపంచంలో పోరాడటానికి అవసరమైన నైపుణ్యం లేకుండానే విద్యార్థులు బయటకు వచ్చి కష్టపడుతున్నారు. డిగ్రీ పట్టాలు చేతపట్టుకొని ఉపాధి అవకాశాల కోసం దిక్కులు చూస్తున్నారు. నైపుణ్యాల మెలకువలు లేక ఉద్యోగ వేటలో చతికిలబడుతున్నారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఉద్యోగ పోటీ పరీక్ష ఎదుర్కొనే సత్తా లేక నిరాశకు గురవుతున్నారు. అత్యుత్తమ శిక్షణ, భవితకు నిచ్చెన... ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ అన్ని రంగాల్లో అభ్యసించే విద్యార్థులకు అతి తక్కువ రుసుముతో అత్యున్నత ప్రమాణాలున్న శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలు ఎలా ఉన్నాయి, ఉద్యోగుల నుంచి యాజమాన్యాలు ఎలాంటి నైపుణ్యాలు ఆశిస్తున్నాయనే అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, రీజనింగ్‌తో పాటు జావా, పైథాన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్, డాటా సైన్స్, బ్లాక్‌చైన్ లాంటి ఆధునిక సాంకేతిక అంశాల శిక్షణతో పాటు ఆయా కంపెనీల భాగస్వామ్యంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నారు.

గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు సాన... గ్రామీణ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఈ కోర్సుల్లో ప్రతిభకు సానపడుతున్నారు. ప్రత్యేక కార్యశాలలు నిర్వహించి నిపుణుల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. స్థానిక కళాశాలల్లో బోధకులతో పాటు ప్రత్యేకంగా టాస్క్ బృందం సభ్యులు కళాశాలలకు వచ్చి బోధిస్తున్నారు.

ఆలోచనలకు సాంకేతికత జోడింపు... ఉద్యోగాల చుట్టూ విద్యార్థుల ఆలోచనలు తిరగకుండా వినూత్నమైన మార్గాలను ఎంచుకుని విజయం సాధించే దిశగా చేయూత ఇస్తున్నారు. పరిశ్రమలు నెలకొల్పడంలో మెలకువలు, అవసరాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆలోచనలకు సాంకేతికత జోడించి అవకాశాలు ఎలా సృష్టించాలనే ఆలోచనలను నేర్పిస్తున్నారు.

కొరవడుతున్న ఆసక్తి... విద్యార్థుల భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దే నైపుణ్య శిక్షణపై పలువురు ఆసక్తి చూపటం లేదు. వివిధ కారణాలతో ఇంజినీరింగ్, డిగ్రీ చదువుకునే విద్యార్థులు ముందుకు రావడం లేదు. శిక్షణ పొందేందుకు విద్యార్థులు కొంత రుసుము చెల్లించేందుకూ వెనుకాడుతున్నారు. కొన్ని కళాశాలలు కూడా నమోదు చేసుకోవడం లేదు. కళాశాలలు నమోదు/రెన్యూవల్ చేసుకునేందుకు తుది గడువు: జులై 15 బీ విద్యార్థులు నమోదు చేసుకునేందుకు తుది గడువు: ఆగస్టు 30 వారధిగా నిలుస్తున్న 'టాస్క్'... కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించడం తప్ప వారికి సరైన ఉపాధి మార్గాలు చూపడం లేదు. కళాశాల విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అవకాశాలు కోల్పోతున్న యువతకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'టాస్క్'(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) వారధిగా నిలుస్తోంది. నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా రూపకల్పన చేసిన ఈ సంస్థ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఒక వైపు చదువు, మరో వైపు జీవితంలో అవసరమైన నైపుణ్యాలను టాస్క్ పదును పెడుతో ంది. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థుల నమోదు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40 కళాశాలలు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా సుమారు 3,500 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. బహుళజాతి సంస్థల భాగస్వామ్యం...తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం చేపట్టిన 'టాస్క్'లో బహుళజాతి సంస్థలను భాగస్వాములను చేసింది. నైపుణ్యాలున్న అభ్యర్థులను కోరుకుంటున్న పరిశ్రమలకు టాస్క్ వేదికగా పని చేస్తోంది. ఈ సంస్థలో నమోదు చేసుకున్న విద్యార్థులకు దిగ్గజ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. టాస్క్ ఐటీతో పాటు పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకుంది.

# చెక్కులిద్దామా ... వద్దా..?



కొత్తగూడెం : వెనుకబడిన తరగతులు, కుల వృత్తుల వారికి చేయూతనందించేందుకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం పంపిణీకి శ్రీకారం చుట్టింది. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గానికో పది మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసింది. మిగిలినవారికి ఈనెల 15 నుంచి ఆర్థిక సాయమందించాలని నిర్ణయించినా ప్రక్రియ మొదలుకాలేదు.

జాబితా రూపకల్పనకు తంటాలు

క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. ఇదే క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు, పైరవీలు పెరుగుతుండటంతో తుది జాబితా రూపకల్పనకు తంటాలు పడాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో ఈ భారాన్ని తప్పించుకోవటానికి అధికారులు చేతులెత్తేస్తున్నారు. అసలు ఎంపిక ప్రక్రియలో తమ ప్రమేయం ఉండటం లేదని, జిల్లా స్థాయిలో అంతా జరుగుతుందని దరఖాస్తుదారులకు చెబుతున్నారు. మంగళవారం వరకు చెక్కులను లబ్ధిదారులందరికీ అందజేయాల్సి ఉన్నా ఇప్పటివరకు ప్రక్రియ మొదలుకాకపోవటం గమనార్హం. ఆర్థిక సాయం పంపిణీ నిరంతర ప్రక్రియ అని.. ప్రతినెలా కొంతమంది లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.

ప్రజాప్రతినిధులకు తప్పని ఇక్కట్లు..!రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, పోడు పట్టాల పంపిణీతో పాటు బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సాయం పథకం అమలు ప్రజాప్రతినిధులకు భారంగా మారింది. ఇటీవల పోడు పట్టాల పంపిణీ సమయంలో కొందరు ఎమ్మెల్యేలకు గిరిజనుల నుంచి నిరసన సెగలు తగిలాయి. ఎట్టకేలకు పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తిచేసిన నాయకులకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకం తలనొప్పిగా మారింది. గ్రామాల్లో కొందరికి ఇస్తే మిగతావారు ఎక్కడ దూరమవుతారోననే ఆందోళన వారిలో మొదలైంది. ఎన్నికలకు ముందు కొంతమందికి ఇస్తే మిగతావారు వ్యతిరేకమవుతారని భావించటం వల్లే చెక్కుల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.

27,495 మంది అర్హులుగా గుర్తింపుఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 27,495 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 300 మందికి చొప్పున ఆర్థిక సాయమందిస్తామని చెప్పటంతో అర్హుల్లో గుబులు మొదలైంది. దరఖాస్తుదారులు భారీ సంఖ్యలో ఉండటంతో తొలివిడత సాయం తమకు దక్కుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఏ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందో తెలియక తలలు పట్టుకుంటున్నారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో కొంతమంది వివరాలను అధికారులు ఫోన్ ద్వారా తెలుసుకున్నారని సమాచారం. ఈ విషయంపై ఓ మండల స్థాయి అధికారి తో మాట్లాడుతూ తమ దగ్గర ఎలాంటి జాబితా లేదన్నారు. అర్హుల వివరాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పంపించామని తెలిపారు.ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలోనే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమం చేపడతాం.ఇనపనూరి ఇందిర, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# నిర్లక్ష్యమే నిండా ముంచింది...!



భద్రాచలం : గోదావరి ఉరుకులు, పరుగులు పెడుతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ప్రియాంక అల ఇటీవల సమీక్ష జరిపారు. మన్యానికి పెద్ద దిక్కుగా ఉన్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓలు బదిలీ కావడంతో కొత్తవారు త్వరలో చేరనున్నారు. ఉన్నతాధికారులందరూ కొత్తవారు కావడంతో తమను ఎవ్వరూ ఏమీ అనరన్న ధీమాతో స్థానిక అధికారులు అలసత్వం చాటారు. ఈ క్రమంలో వరదలు పోటెత్తి క్షేత్రస్థాయి పనుల్లో డొల్లతనం బట్టబయలైంది. సాధారణ రోజుల్లో మురుగు నీరు నేరుగా కరకట్ట లాకర్ల నుంచి గోదావరిలో కలుస్తుంది. వరదల తరుణంలో లాకర్ల(స్లూయిస్)ను మూసేస్తారు. ఆ సమయంలో వర్షం వస్తే లాకర్ల వద్ద నీరు తన్నిపట్టి ఉండకుండా విస్తా కాంప్లెక్స్, కొత్త కాలనీ వంటి చోట్ల మోటార్లను ఏర్పాటు చేశారు. వీటిని ఉపయోగించి వృథా నీటిని పైపుల గుండా నదిలో కలపాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యం చాటారు.

ముంపు ముప్పు: విస్తా వద్ద 470 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేయగా 100 హెచ్‌పీ గల 2 మోటార్లు మొరాయించాయి. మురుగుతోపాటు వర్షం నీరు రామాలయ పరిసరాల దుకాణాలను ముంచేసింది. పడమర మెట్లపైపు దర్శనాలకు అవకాశం లేక భక్తులు అవస్థ పడ్డారు. అన్నదాన సత్రంలోకి నీళ్లు చేరడంతో అన్నదానం ఆపేసి పులిహోరా అందించారు. కొత్త కాలనీలోని రెండు మోటార్లలో ఒకటి పని చేయకపోవడంతో ఇళ్లలోకి నీరు చేరింది. బాధితులు పునరావాస కేంద్రానికి తరలి వెళ్తున్నారు. ప్రకృతి విలయం కన్నా అధికారుల నిర్లక్ష్యమే కొంప ముంచింది. ఆలస్యంగా తేరుకున్న అధికారులు మురుగు కాల్వలకు మరమ్మతు చేయిస్తున్నారు. అదనపు మోటార్లను తెప్పించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. ఇంకా వరద పెరిగితే రోడ్లపై నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. గోదావరి కరకట్టకు ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

కొత్తగూడెం గ్రామీణం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాల సగటున 43.1 మి.మీ. వర్షం కురిసింది. చర్ల మండలంలో 100.4, కరకగూడెం- 23, పినపాక-47.2, దుమ్ముగూడెం- 55.4, అశ్వాపురం- 42.4, మణుగూరు- 40.6, ఆళ్లపల్లి- 73.2, గుండాల- 33.8, ఇల్లెందు- 45.2, టేకులపల్లి- 25.4, జూలూరుపాడు- 30, చంద్రుగొండ- 38.2, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి- 17, సుజాతనగర్- 11.4, కొత్తగూడెం-21, లక్ష్మీదేవిపల్లి-31, పాల్వంచ- 39.8, బూర్గంపాడు- 61.6, భద్రాచలం- 91.2, ములకలపల్లి- 28.8, దమ్మపేట-62, అశ్వారావుపేటలో 37.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

లోతట్టు ప్రాంతవాసులను పునరావాసాలకు తరలించండి: కలెక్టర్

భద్రాచలం: లోతట్టు ప్రాంతంలోని వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్నకల్యాణి, తహసీల్దార్ రామకృష్ణ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారి నాగలక్ష్మితో కలిసి భద్రాచలంలో ముంపు ప్రభావిత ప్రాంతాలను గురువారం పరిశీలించారు. కొత్త కాలనీ, విస్తా కాంప్లెక్స్, గోదావరి కరకట్ట, రామాలయం పరిసరాలను సందర్శించారు. రామాలయం పడమర మెట్ల వైపు నీరు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లోకి వచ్చిందని అర్ధరాత్రికి 46 అడుగులకు నీటిమట్టం చేరుకుంటుందని తెలిపారు. పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టాలన్నారు.

తాలిపేరు ఉగ్రరూపం తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్లోని చింతవాగు, రోటెంతవాగు, రాళ్లవాగు, పగిడి వాగులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తూ 'తాలిపేరు'లో కలుస్తున్నాయి. 24 గేట్లను ఎత్తి దిగువ గోదావరికి 1,02,399 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని పాతగూడలో అత్యధిక వర్షపాతం నమోదవటంతో పాటు క్యాచ్‌మెంట్‌లోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండంతో ఈ స్థాయిలో జలాశయానికి వరద వస్తోందని అధికారులు వెల్లడించారు.

## కిన్నెరసానికి జలకళ

పాల్వంచ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఒక్కసారిగా కిన్నెరసానికి వరద ప్రవాహం పోటెత్తింది. ఉదయం నుంచి వరద భారీగా వచ్చి చేరుతోంది. సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 401.50 అడుగులకు చేరింది. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో రాత్రి 9 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు రెండు గేట్లు పైకెత్తి ఉంచాలని కేటీపీఎస్ అధికారులు నిర్ణయించారు. గేట్లు పైకెత్తి ఉంచడంతో దిగువకు 10 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. క్జిన్నెరసాని పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చాటింపు వేయించారు. సైరన్లు మోగించారు. పొలాల్లోని మోటార్లు భద్రపరుచుకోవాలని సూచించారు.స్వల్ప పెరుగుదల: వైరా, న్యూస్‌టుడే: వైరా జలాశయంలో నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం సామర్థ్యం 18.3 అడుగులు కాగా గురువారం రాత్రి వరకు నీటిమట్టం 15.3 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నీటిమట్టం పెరుగుదల స్వల్పంగానే ఉందని అధికారులు భావిస్తున్నారు. మరో మూడు అడుగుల వరకు నీటిమట్టం పెరిగితేనే పూర్తిస్థాయిలో నిండనుంది. వర్షాలతో వరి సాగు చేసేందుకు రైతులు ఉత్సుకత చూపిస్తున్నారు.

# సారపాక ఎన్నికలపై సందిగ్ధత

బూర్గంపాడు : బూర్గంపాడు మండలంలోని సారపాక పంచాయతీ ఎన్నికల విషయంలో సందిగ్ధత వీడటం లేదు. మున్సిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో 2019లో ఇక్కడ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం జరిగిన పురపాలిక ఎన్నికల్లోనూ సారపాక పేరు చేర్చలేదు. పరిషత్ ఎన్నికల్లోనూ పరిగణనలోకి తీసుకోలేదు. అప్పటి నుంచి ఏ ఎన్నికలకూ నోచక ఈ ప్రాంతం త్రిశంకు స్వర్గంలో ఉంది. సారపాకతోపాటు రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించని పంచాయతీల అంశంలో పలువురు హైకోర్టును ఆశ్రయించారు. తక్షణం ఏదో ఒక నిర్ణయం తీసుకుని ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీలో బిల్లును తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపించినట్లు ప్రచారం సాగింది. దీనిపై స్పష్టత రాకపోవడంతో ఎన్నికల అంశం మళ్లీ మొదటికి వచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఎన్నికల విషయంలో స్థానికులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పాలకవర్గం లేకపోవడంతో ఆశించినస్థాయిలో



అభివృద్ధి జరగడం లేదన్నది స్థానికుల వాదన.

అర్హతలున్నా..15 వేలకు పైచిలుకు జనాభా ఉండి పట్టణీకరణ వాతావరణం కలిగిన ప్రాంతాలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం సారపాక జనాభా 20 వేలు. ప్రస్తుతం ఇక్కడ 32 వేల మందికి పైగా నివసిస్తున్నారు. భద్రాద్రికి ముఖద్వారంగా సారపాకకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గోదావరికి ఓవైపు సారపాక.. మరో వైపు భద్రాచలం జంట పట్టణాలుగా భాసిల్లుతున్నాయి. జనాభాతోపాటు అన్ని అర్హతలు ఉండటంతో సారపాకను మున్సిపాలిటీ చేయాలన్న డిమాండ్ తాజాగా ఊపందుకుంది.

# లక్ష్యం నెరవేరని తునికాకు సేకరణ

జనగామ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది అతి తక్కువగా 43 శాతం తునికాకు సేకరణ జరిగింది. మహదేవపూర్ అటవీ డివిజన్‌లో 42.78 శాతం, భూపాలపల్లి డివిజన్‌లో 43.02 శాతం వరకే తునికాకు సేకరణ చేపట్టారు. అటవీశాఖ అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు సేకరణ జరగకపోవడంతో కూలీలకు అనుకున్నంత ఆదాయం రాలేదు. కొన్ని యూనిట్లలో మే 1 నుంచి తునికాకు సేకరణ ప్రారంభించగా, మరికొన్ని యూనిట్లలో మే 5, 6 తేదీల్లో సేకరణ మొదలుపెట్టగా గత నెల 31న ముగిసింది.

ముందస్తుగా టెండర్లు నిర్వహించినా..

సేకరణ ప్రారంభమైన పది రోజుల్లోనే దాదాపు 40-50 శాతం తునికాకు కట్టలు కల్లాల వద్దకు చేర్చేవారు. ఈ ఏడాది ఆకు సేకరణ ముగిసినా.. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. లక్ష్యాన్ని అందుకోకపోవడంతో కూలీలు సేకరించిన తునికాకును ఇళ్ల వద్దనే ఆరబెడితే ఆ కట్టలను సంబంధిత గుత్తేదారులు కొనుగోలు చేసుకునే అవకాశాన్ని అటవీశాఖ అధికారులు కల్పించారు. ఈ సీజన్‌లో వందశాతం సేకరణ చేపట్టాలనే లక్ష్యంతో అటవీశాఖ ముందస్తుగా తునికాకు టెండర్లను పూర్తి చేసినా.. ఆశించిన ఫలితాలు రాలేదు. అడవుల్లో తునికాకు ఎక్కువగా లేకపోవటం, అటవీ గ్రామాల్లో ఉపాధి పనుల కారణంగానే ఆకు సేకరణ తగ్గిందని భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు అటవీ డివిజన్లలో మొత్తం 10 యూనిట్లలో ప్రభుత్వం 12,100 స్టాండర్డ్ బ్యాగులు(ఎస్‌బీ) లక్ష్యం నిర్దేశించగా, కేవలం 5,577 ఎస్‌బీలు సేకరించడంతో 43 శాతం నమోదైంది.



డివిజన్ల వారీగా తునికాకు సేకరణ వివరాలు పరిశీలిస్తే.. భూపాలపల్లి అటవీ డివిజన్‌లో మొత్తం 19 యూనిట్లు ఉండగా ఇందులో కేవలం నాలుగు యూనిట్లే అమ్ముడుపోయాయి. ఈ నాలుగు యూనిట్లలో 4,500 ఎస్‌బీల లక్ష్యం నిర్ణయించారు. ఈ డివిజన్‌లో 1,935 ఎస్‌బీలు సేకరించారు. మహదేవపూర్ డివిజన్‌లో 16 యూనిట్లు ఉండగా ఆరు యూనిట్లు అమ్ముడుపోగా, 7,600 ఎస్‌బీల లక్ష్యానికి గాను 3,642 ఎస్‌బీలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎండిన తునికాకు బస్తాలు 1,580 వరకు తునికాకు కల్లాల నుంచి గుత్తేదారులు గోదాంలకు తరలించారు. ప్రభుత్వం ఒక ఎస్‌బీ సేకరణకు రూ.3వేలు చెల్లిస్తోంది. ఈ లెక్కన కూలీలకు దాదాపుగా రూ.1.37 కోట్ల వరకు ఆదాయం లభించనుంది.

గుత్తేదారులు ముందుకు రాలేదు

- లావణ్య, డీఎఫ్‌వో, భూపాలపల్లి

అటవీ ప్రాంతంలో నాణ్యత గల ఆకు లేకపోవడంతో ఆశించిన మేరకు తునికాకు సేకరణ జరగలేదు. ఈసారి ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించటంతో గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో చాలా వరకు తునికాకు యూనిట్లు అమ్ముడు పోలేదు. లక్ష్యానికి మించి చేపట్టిన యూనిట్లలో తునికాకు కూలీలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాం.

# ఇక పక్కాగా రేషన్ బియ్యం లెక్క!

హుజూరాబాద్: ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ప్రజా పంపిణీలో అమలు చేసే సాంకేతికతను ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ఈ నెల నుంచి రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గిడ్డంగులకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

తీరనున్న తరుగు కష్టాలు

ఉమ్మడి జిల్లాలోని 14 ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి 1,964 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతుంది. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. తమ దుకాణాలకు వచ్చేసరికి ప్రతీ బస్తాలో నాలుగైదు కిలోలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దాదాపు 30 శాతం గన్నీ సంచులు నాణ్యత కొరవడి చిల్లులు పడటం వల్లే తరుగు వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని రేషన్ డీలర్లు పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం ఇచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. సాంకేతిక సమస్యను సవరించి ఈ నెల నుంచే బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు వేలిముద్ర వేసినప్పుడు ఈ-పాస్‌కు వేయింగ్ యంత్రాన్ని ఎలా అనుసంధానం చేస్తారో అదే విధానాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద డీలర్ల వేలిముద్రలతో బియ్యం అందజేయనున్నారు. ఈ విధానంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి డీలర్లకు సరఫరా చేసిన బియ్యం లెక్కలు ఈ-పాస్ ద్వారా కచ్చితంగా నమోదయ్యే అవకాశం ఉంది.

గన్నీ సంచి తిరకాసుతో ఆలస్యం

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 9,79,920 కార్డులు ఉండగా.. కేంద్రం కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో.. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 18,043.735 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ సంచి బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు వాపోతున్నారు. అందుకే ప్రతి నెల 26వ తేదీ నుంచి గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలోని చాలామంది డీలర్లు సోమవారం వరకూ తీసుకోలేదు. గన్నీ సంచి బరువు తీసివేసి బియ్యం ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారని, నుంచి బియ్యం తీసుకుంటామని డీలర్లు చెబుతున్నారు. ప్రతినెలా 5వ తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండటంతో ఇకపై ప్రతినెలా 7వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరాగత ఫిబ్రవరిలో డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం ఇవ్వాలని భావించినా సాంకేతిక సమస్యతో అమలు చేయలేదు. ఈ నెల నుంచి ప్రతీ డీలర్‌కు బయోమెట్రిక్ ద్వారానే బియ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. గతంలో బియ్యం తరుగు వస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చేవి. ఇక నుంచి అలాంటి సమస్య ఉండదు. కార్డులు, యూనిట్ల ఆధారంగా ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం సరఫరా అవుతుంది. నిబంధనలకు అనుగుణంగానే బియ్యం ఇవ్వాలని గోదాం అధికారులకు సూచించాం. శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, పౌర సరఫరాల సంస్థ, కరీంనగర్

# పొద్దంతా ఒడ్డుకు.. రాత్రయితే పట్టణాలకు

సారంగాపూర్: గోదావరి తీరం నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ఎస్సారెస్పీ నిండడంతో వరద నీరు వదలడంతో గోదావరిలో ఇసుక మేటలు ఎక్కువయ్యాయి. జగిత్యాల జిల్లా పరిధిలోని బీర్‌పూర్, ధర్మపురి, మల్లాపూర్, రాయికల్ మండలాల్లో గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని నదీ తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా జగిత్యాల పట్టణానికి యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతుంది. రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇసుకను నదీ ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు.

రీచ్‌ల ఏర్పాటులో జాప్యం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ఏటా గోదావరి తీరం వెంట అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, రేకులపల్లె, చిత్రవేణిగూడెం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అనువుగా ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకంతా తరలిపోయింది. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది.

ఇతరులు వెళితే అభ్యంతరమే!మండలంలోని గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు ఇసుకను తీసుకువచ్చేందుకు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకునే వీలుంటుంది. దీనిద్వారా ట్రాక్టర్ యజమానులు గృహ అవసరాలకు ఒక్కో ట్రిప్పుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు కాగా, టిప్పరు రూ.20 నుంచి రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. ఎక్కడైనా అడ్డుకుంటే అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి తీరం వెంట డంపుల కొద్దీ ఇసుక ఉన్నప్పటికీ ఏనాడు అధికారులు సీజ్ చేయకపోవడంతో దందా నిరంతరంగా కొనసాగుతుంది. అప్పుడప్పుడు పోలీసులు, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేస్తున్నప్పటికీ మైనింగ్ అధికారుల జాడ కనపడడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణానికి తరలుతున్న ఇసుక టిప్పర్‌ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకుడుబీర్‌పూర్ మండలంలో ఎలాంటి ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయలేదు.

# ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి..




కొత్తగూడెం : పేద, ధనిక భేదం లేకుండా అర్హులందరికీ నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు, మన బడి' కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. సర్కారు బడుల్లో విద్యార్థులకు చదువుతో పాటు 12 రకాల మౌలిక వసతులు సమకూరుస్తోంది. ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు (ఉన్నత పాఠశాలల్లో) అభ్యసిస్తున్న విద్యార్థులకు భోజనశాలలు (డైనింగ్ హాల్స్) నిర్మిస్తోంది. గతంలో తరగతి గదులు, వరండాల్లో కూర్చొని బాలబాలికలు భోజనం చేసేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఆధునిక హంగులతో నిర్మించిన భోజనశాలల్లో విద్యార్థులు కలిసి తింటున్నారు.ఒక్కో భోజనశాల నిర్మాణానికి రూ.17.53 లక్షలు

మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ఖమ్మం జిల్లాలో 426, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 368 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లాలో 211 ఉన్నత పాఠశాలలకు 115 చోట్ల భోజనశాలల నిర్మాణానికి పూనుకున్నారు. 60 చోట్ల అదనపు తరగతి గదుల్లో భోజనశాలలు ఏర్పాటు చేశారు. 55 పాఠశాలల్లో కొత్తగా భోజనశాలలు నిర్మిస్తున్నారు. 23 చోట్ల పనులు పూర్తయ్యాయి. భద్రాద్రి జిల్లాలో 65 ఉన్నత పాఠశాలలను గుర్తించగా 57 చోట్ల భోజనశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 33 చోట్ల పనులు పూర్తయ్యాయి. ఒక్కో భోజనశాల ఏర్పాటుకు రూ.17.53 లక్షలు వెచ్చిస్తున్నారు. భోజనం చేసిన విద్యార్థులకు నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా కుళాయిలు అమర్చారు.

మా పాఠశాలలో ఏర్పాటు చేసిన భోజనశాలలో స్నేహితులతో కలిసి తింటున్నా. ఇంటిని మైమరిపించే అనుభూతి కలుగుతోంది. తరగతి గదులు, వరండాల్లో తినే బాధలు తప్పాయి. భోజనశాలకు సమీపంలోనే చక్కటి నీటి సదుపాయం ఉంది. భోజనం తిన్నాక తరగతి గదుల్లోకి వెళ్తున్నాం.శిరీష, ఆరో తరగతి విద్యార్థిని, తల్లాడ మండలం ఉన్నత పాఠశాలతరగతులు వేరైనా మధ్యాహ్న భోజన సమయానికి అందరం ఒకేచోటుకు చేరుతాం. గతంలో వర్షాకాలం వస్తే ఇబ్బందులు ఎదురయ్యేవి. తరగతి గదులు, వరండాల్లో కింద కూర్చొని భోజనం చేశాం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. బల్లలపై కూర్చొని భోజనం చేస్తున్నాం.పవన్‌కుమార్, తొమ్మిదోతరగతి, కరకవాగు ఉన్నత పాఠశాల, పాల్వంచరాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు నిర్మిస్తున్నాం. కొన్నిచోట్ల అందుబాటులోకి వచ్చాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు భోజనం చేస్తున్నారు. సోమశేఖరశర్మ, డీఈఓ

# ఉత్పత్తి నిలిచినా ..రవాణా తగ్గేదెలే



సత్తుపల్లి : మూడు రోజులుగా ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూ బొగ్గు ఉత్పత్తి నిలిచినప్పటికీ నల్లబంగారం రవాణా మాత్రం నిరాటంకంగా సాగుతోంది. అధికారులు వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే కోల్ యార్డుల్లో పెద్దఎత్తున బొగ్గు నిల్వలు పెంచారు. ప్రస్తుతం రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీలతోపాటు పీవీకే-5, జీకే ఓసీల్లో దాదాపు 1.08 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి వర్షం ఆటంకంగా మారగా మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లోని గనుల్లో బొగ్గు ఉత్పత్తికి వర్షం విఘాతం కలిగించింది. ఆయా గనుల్లోనూ బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ పనులు నిలిచాయి. ఏడాదికి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడం కోసం చేపట్టిన ప్రణాళికలో వర్షాల వల్ల తాత్కాలికంగా ఉత్పత్తి నిలిచినా రవాణాలో మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు.

ఏరియాల్లో బొగ్గు వివరాలు ఇలా...

రీ కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ ఏడాదికి (ఏప్రిల్ నుంచి మార్చి) 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.2 మి.ట. ఉత్పత్తి సాధించింది. ఈ నెలలో 7.50లక్షల టన్నులకు గాను ఇప్పటి వరకు 5.53లక్షల టన్నులు వెలికితీశారు. కిష్టారం ఓసీలో ఈ నెలలో 1.50లక్షల టన్నులకు 1.39లక్షల టన్నులు వెలికితీశారు. సీహెచ్‌సీ ద్వారా రోజూ 32వేల టన్నులు రవాణా చేస్తున్నారు. రెండు గనుల్లో వర్షం కారణంగా లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచింది. ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓసీ-2కు ఏడాదికి 30లక్షల టన్నులకు ఇప్పటి వరకు 9.7లక్షల టన్నులు ఉత్పత్తి చేశారు. ఈ నెలలో 2.13 లక్షల టన్నులకు 1.4 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి రవాణా చేస్తున్నారు. మూడు రోజుల్లో 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి వర్షం ఆటంకంగా మారింది.

మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో ఏడాదికి లక్ష టన్నులకు గాను ఇప్పటి వరకు 26,055, పీకే ఓసీ-2లో 59లక్షల టన్నులకు 21 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. ఈ నెలలో పీకే ఓసీ-2లో 4.20లక్షల టన్నులకు 3.52లక్షల టన్నులు, పీకే ఓసీ-4లో 2.50లక్షల టన్నులకు 2.17లక్షల టన్నులు, మణుగూరు ఓసీలో లక్ష టన్నులకు 1,40,058 టన్నులు ఉత్పత్తి చేశారు.

నూటికి 80 శాతం రవాణా చేస్తున్నాం: ఎం.షాలేంరాజు, జీఎం, కొత్తగూడెం ఏరియా

ప్రతి రోజూ నూటికి 80శాతం బొగ్గును రవాణా చేస్తున్నాం. ఏరియాలో 56 మి.మీ. వర్షపాతం నమోదు కాగా మూడు రోజులుగా ఉత్పత్తి, ఓబీ పనులు నిలిచాయి. సాధారణ రోజుల్లో రోజుకు 10 రేకుల బొగ్గును తరలిస్తుండగా వర్షం కారణంగా ప్రస్తుతం రోజుకు 8 రేకుల ద్వారా 32వేల టన్నులకు తగ్గకుండా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వర్షం కారణంగా ఇప్పటి వరకు 30వేల టన్నుల బొగ్గు రవాణాకు అంతరాయం కలిగింది. ముందస్తుగా బొగ్గు నిల్వలు పెట్టుకోవడం వల్లే ఎక్కడా ఇబ్బంది లేకుండా రవాణా చేయగలుగుతున్నాం.

# స్వచ్ఛపల్లె...నిత్య మల్లె

ముదిగొండ : పల్లె సీమల్లో పరిశుభ్రత సాధించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈక్రమంలో పలు పంచాయతీలు వాటిని అందిపుచ్చుకుంటూ స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నాయి. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించాలన్నది స్వచ్ఛసర్వేక్షణ్ లక్ష్యం. 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023' అవార్డు సాధించడానికి జిల్లాలో 15 గ్రామపంచాయతీలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి నామినేట్ చేశారు. వాటిలో ముదిగొండ మండలంలోని పమ్మి, కొత్తలక్ష్మీపురం, మేడేపల్లి గ్రామాలు ఉన్నాయి. పంచాయతీలో జనాభా ప్రాతిపదికన మూడు కేటగిరిల్లో 2వేలలోపు జనాభాలో జిల్లాలోని రేగులచలక, దాచపురం, కొర్లగూడెం, కిష్టాపురం, కొత్తలక్ష్మీపురం గ్రామపంచాయతీలు, 2-5వేలు జనాభా కేటగిరిలో పమ్మి, కూసుమంచి, కుర్నవల్లి, తిరుమలాయపాలెం, మేడేపల్లి గ్రామపంచాయతీలు, 5వేల జనాభా విభాగంలో తల్లాడ, కల్లూరు, కొణిజర్ల కాకరాలపల్లి, బోనకల్లు పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలు ఉత్తమ ర్యాంకుల ఆధారంగా జాతీయ స్థాయిలో పోటీపడనున్నాయి.

తడి, పొడి చెత్త.. ఒక ఆదాయ వనరు

కొత్తలక్ష్మీపురం గ్రామంలో 1500 జనాభా ఉండగా 435ఇళ్లు ఉన్నాయి. 320 ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో 8 కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారు. వాటిని సెగ్రిగేషన్‌షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు 493 కిలోల సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించారు. తద్వారా పంచాయతీకి రూ.4536 ఆదాయం వచ్చింది. ప్రతి ఇంట వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్నారు.

ఇంటింటా ఇంకుడుగుంత

ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో 2810 జనాభా కాగా 564 ఇళ్లు ఉన్నాయి. 542 ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో అయిదు కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి, ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టి గ్రామస్థులు ఆదర్శంగా నిలిచారు. తడి, పొడిచెత్త విక్రయం ద్వారా పంచాయతీ ఆదాయం ఆర్జిస్తోంది.

బృందాల క్షేత్ర పర్యటన.. మార్కులతో పురస్కారం

స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారం కోసం నామినేట్ చేసిన గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర బృందాలు పర్యటించి ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటా మరుగుదొడ్డి నిర్మాణం, ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను సేకరించి సెగ్రిగేషన్‌షెడ్లకు తరలించడం, ఆ షెడ్లలో సేంద్రియ ఎరువుల తయారీ, లాగ్‌బుక్ నిర్వహణ, పాలిథిన్ నిషేధం అమలు, స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం, ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణాలను వారు పరిశీలించనున్నారు. ఉత్తమ పనితీరు కనబర్చిన పంచాయతీలకు మార్కులు వేస్తారు. వాటి ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులను సాధించిన గ్రామపంచాయతీలను జాతీయస్థాయికి పంపుతారు. జాతీయస్థాయిలో ఎంపికైన ఉత్తమ గ్రామ పంచాయతీలకు గాంధీ జయంతి రోజున దిల్లీలో పురస్కారాలు అందజేస్తారు. జాతీయ స్థాయిలో అవార్డు సాధించాలన్న లక్ష్యంతో మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణాలు లేని చోట నిర్మాణం చేపడుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 పురస్కారం సాధించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

# ఆదాయం ఖరారు.. పేదరికం పరారు!

కరీంనగర్ : కాలం మారుతున్నట్లే.. ఉమ్మడి జిల్లాలో ప్రజల జీవన విధానం మారుతోంది. ఆర్థికంగా, సామాజికంగా జనుల శైలి ప్రగతి పథాన పయనిస్తోంది. తలసరి ఆదాయం పైపైకి ఎగబాకుతుండగా.. దారిద్ర్య రేఖను దాటుతూ పలు కుటుంబాలు పేదరికాన్ని దూరం చేసుకుంటున్నాయి. అందివస్తున్న పథకాలు, దరిచేరుతున్న సంక్షేమాలు, పలు రకాల అభివృద్ధి చెంతన నిలుస్తుండటంతో కనీస మౌలిక వసతులు మెరుగవుతున్నాయి. ఒకప్పటితో పోలిస్తే నాలుగు జిల్లాల పరిధిలో గణనీయమైన ప్రగతి నమోదవుతోంది.. తాజాగా నీతి ఆయోగ్ విడుదల చేసిన 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ సూచీ ప్రోగ్రెసివ్ రివ్యూ-2023 నివేదిక ఈ విషయాన్ని వెల్లడి చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన సర్వేల్లో గుర్తించిన వివరాల్ని అందులో పొందుపర్చింది.

12 అంశాలపై పరిశీలన

జిల్లాలో ప్రజల జీవన స్థితిలో కీలకమైన 12 అంశాలను ఎంచుకుని నీతి ఆయోగ్ సర్వే చేపట్టింది. దీని ఆధారంగానే సమగ్ర నివేదికను రూపొందించింది. జిల్లాల తీరు తెన్నుల్ని విశ్లేషించింది. కీలకమైన వైద్యంతోపాటు పౌష్టికాహారం, జనన మరణాలు, విద్యాప్రగతి తీరు, మౌలిక వసతుల కల్పన, సమకూరుతున్న వసతులు, ఆర్థిక వికాసం, పారిశుద్ధ్య నిర్వహణ, మెరుగవుతున్న జీవన విధానం, తాగునీటి సమస్య ఇలా.. భిన్న కోణాల్లో ఇక్కడి స్థితి గతుల్ని అంచనా వేశారు.

ఇలా ప్రత్యేకతలు.. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 (2015-16) సర్వే ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8.65 శాతం పేదలు ఉండగా ఇప్పుడు నాలుగు జిల్లాల సగటు 3.31 శాతానికి తగ్గింది. రాష్ట్రస్థాయిలో నాలుగు జిల్లాల్లో పేదల కుటుంబాల సంఖ్య తక్కువగా ఉండటం శుభపరిణామం. పెద్దపల్లి జిల్లా పేదలు అతి తక్కువగా ఉన్న జిల్లాల జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది. ఇక కరీంనగర్ జిల్లా 3వ స్థానంలో, సిరిసిల్ల 6, జగిత్యాల 16వ స్థానానికి పరిమితమైంది. 2015-16లో హైదరాబాద్ జిల్లా 4.21 శాతం పేదలతో పాత పది జిల్లాల్లో తక్కువ పేదలున్న జిల్లాగా అగ్రస్థానంలో నిలబడగా.. కరీంనగర్ అప్పుడు రెండో స్థానంలో నిలిచింది. ఇప్పుడు కొత్త జిల్లాల ఆధారంగా పెద్దపల్లి జిల్లాలో కేవలం 2.17 శాతం పేదలు ఉండగా.. మన జిల్లా సరిహద్దునే ఉన్న కుమురంభీం జిల్లాలో 16.59 శాతం పేదలు ఉన్నారు.

దేశంలో 2015-16 నుంచి 2019-21 మధ్యకాలంలో పేదరికం 24.85 నుంచి 14.96 శాతానికి తగ్గింది. మన రాష్ట్రంలో 13.88 శాతం నుంచి 5.88 శాతానికి తగ్గారు.

రాష్ట్ర శాతంతో పోలిస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెరుగ్గానే ఉంది. జగిత్యాల జిల్లాలో ఇంకా పేదరికం ఛాయలుండగా మిగతా మూడు జిల్లాలు మెరుగ్గానే ఉన్నాయి.



ఇలా మెరుగయ్యాం..! మహిళల ఆర్థిక ప్రగతి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైంది. నాలుగు జిల్లాల్లో కలిపి 49,764 స్వయం సహాయక సంఘాలకు చెందిన సుమారు 6 లక్షల మంది రుణసాయాలతో ఆర్థిక స్వావలంబనని అందుకుంటున్నారు. ఏటా రూ.3 వేల కోట్ల రుణ సాయంతో ఇంటికి అవసరమైన ఆదాయాన్ని ఉపాధి ద్వారా పొందుతున్నారు.

ఉపాధిహామీ పథకం ప్రయోజనాలతో చిన్న కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందుతోంది. ఉమ్మడి జిల్లాలో 11,00,897 మంది జాబ్ కార్డులను పొందారు. ఇందులో 4,32,711 మంది నిత్యం పనికి వెళ్తూ దినసరి వేతనాన్ని అందుకుంటున్నారు. కుటుంబ పోషణకు అవసరమైన ఆదాయాన్ని ఇంతకింతకు మెరుగుపర్చుకుంటున్నారు. పల్లె, పట్టణ ప్రగతి వల్ల పారిశుద్ధ్యం మెరుగవుతోంది. ప్రతి త్రైమాసికంలో వస్తున్న నిధులను స్వచ్ఛత కోసం వినియోగిస్తున్నారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లా జిల్లాల ఏర్పాటుకు ముందే బహిరంగ మలమూత్ర విసర్జన లేని జిల్లాగా మారిపోయింది. శతశాతం మరుగుదొడ్లను 1,218 పంచాయతీల్లో ప్రజలు నిర్మించుకున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా పరంగా మిషన్ భగీరథ వరంగానే మారింది. ఎక్కువ శాతం ఇళ్లకు నీళ్ల కుళాయిల ద్వారా అందుతున్నాయి. పిల్లల్లో పోషకాహార పరిస్థితి మెరుగైంది. 90.37శాతం మంది చిన్నారులు లబ్ధి పొందుతున్నారు. 1,76,746 మందికిగానూ 1,59,727 మంది అనుబంధ పోషకాహారాన్ని స్వీకరిస్తున్నారు. 3,556 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. హాజరు శాతంతోపాటు విద్యాప్రగతిలో మంచి మార్పులు కనిపించాయి. అభ్యసన ఫలితాలు మెరుగవడంతోపాటు వారికి గురుకులాల్లో వసతి, ఉచిత పుస్తకాలు, భోజనంతో కుటుంబాలపై భారం తగ్గి 4,46,767మంది విద్యార్థులకు మేలు జరుగుతోంది.

# నిత్యం వంద మందికే భోజనాలు

మల్యాల : తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి దైవదర్శనం చేసుకుని వెళుతుంటారు. ప్రతి శని, మంగళవారాల్లో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల నుంచి 30 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుని వెళ్తారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారు. భక్తుల ఆకలి తీర్చేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాదాపు 20 ఏళ్ల కిందట 50 మంది భక్తులకే అన్నదానం చేసేవారు. కొన్నేళ్ల నుంచి ఆలయ అధికారులు ప్రతి రోజు 100 మందికి, శని, మంగళవారాల్లో 200 మందికి అన్నదానం చేస్తున్నారు.

పాతకోనేరు పైభాగంలో భక్తుల సౌకర్యం కోసం నిర్మించిన డార్మిటరీ భవనాన్ని అన్నదానసత్రంగా వినియోగిస్తున్నారు. సత్రంలో భక్తులు భోజనం చేయడానికి స్టీలు బెంచీలు, స్టూళ్లు ఏర్పాటు చేశారు. వంటగది షెడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు రేకులకు రంధ్రాలు పడడంతో వర్షాకాలం వంట చేయడానికి ఇబ్బందిగా మారిందని సిబ్బంది తెలిపారు. ఆలయానికి ఏటా దాదాపు రూ.20 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతున్నా పరిమిత సంఖ్యలోనే భోజనం సమకూర్చడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టుకు ప్రముఖుల తాకిడి అధికంగా ఉండటంతో వారి వెంట వచ్చే నాయకులతోపాటు భక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా భక్తులకు అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అన్నదానం కోసం సరఫరా చేసే బియ్యం నాసిరకంగా ఉన్నాయని, అన్నం ముక్కవాసన వస్తోందని ఆలయ ధర్మకర్త ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వెంకటేశ్‌ను సంప్రదించగా నిత్యాన్నదానంలో ప్రతి రోజు 300 మందికి అన్నదానం చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వంటగది షెడ్డును మరమ్మతు చేయించి నాణ్యమైన బియ్యం ఇతర సామగ్రిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# అన్నదాతకు సంక్రాంతి కానుక

జనగామ : అన్నదాతలకు శుభవార్త.. సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పెట్టుబడి సాయం అందించనుంది. ఈ నెల 28 నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. ఈ ప్రక్రియను పండగలోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. జిల్లాలో అత్యధిక శాతం సన్నచిన్నకారు రైతులతో పాటు అనేక మంది పోడు కర్షకులకు ప్రయోజనం కలగనుంది. ఏటా రైతు బంధు పథకం అర్హుల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా, వారసత్వంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారికీ పెట్టుబడి సాయం మంజూరవుతోంది. రైతు బంధు పథకాన్ని 2018 మే 10న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో ఎకరాకు రూ.4 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2019 వానాకాలం సీజన్ నుంచి ఎకరాకు రూ.5 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది విడతల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రస్తుత యాసంగిలో జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పండిస్తారు. ఈ సారి పంటల సాగు ఆలస్యమైంది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందుతుండటంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.




సీజన్ ప్రారంభంలో దున్నేందుకు, ఎరువులకు పెట్టుబడి అవసరం కానుంది. పంట పెట్టుబడి కోసం వేచి చూసే అన్నదాతలకు రైతు బంధుతో ఉపశమనం కలగనుంది.

కొత్త వారికీ అందుతుంది..

విజయ్‌భాస్కర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అర్హులైన అన్నదాతలకు రైతు బంధు పథకం నగదు ఈ నెల 28 నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. ఈ సాయం యాసంగి పెట్టుబడికి ఉపయోగించుకోవాలి. కొత్తవారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జీరాక్స్‌లు ఏఈవోలకు అందజేయాలి. వారికి కూడా రైతు బంధు నగదు ఖాతాలో జమవుతుంది.

# పొదుపు సంఘాలకు నర్సరీల బాధ్యతలు

జనగామ : సాధారణంగా రైతు కుటుంబాలకు చెందిన మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉంటారు. వీరికి వ్యవసాయ పనులపై పట్టు ఉండడంతో పాటు మొక్కల పెంపకంపై అవగాహన ఉంటుంది. వీరికి నర్సరీల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందని ప్రభుత్వం ఆలోచించింది. ప్రయోగాత్మకంగా మండలానికో రెండు నర్సరీలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించి తర్వాత వాటిని విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తొమ్మిదో విడత హరితహారం మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యతలను అప్పగించనున్నారు. దీంతో మహిళలకు కనీసం వందరోజుల పాటు ఉపాధి లభించడంతో పాటు మొక్కల సంరక్షణపై పట్టు లభిస్తుందని భావిస్తున్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఈ బాధ్యతలను అప్పగించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

వర్షాలు కురవగానే..

వచ్చే ఏడాది వర్షాలు కురవగానే రాష్ట్ర వ్యాప్తంగా హరితహారం కార్యక్రమానికి మొక్కలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు



చేస్తోంది. సంఘటితంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు నర్సరీలను సమర్థంగా నిర్వహించగలరని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఇద్దరు మహిళలు వన సేవక్, వాచర్‌గా పని చేయాల్సి ఉంటుంది. కనీసం వంద రోజుల పనిదినాలు కల్పించి, రోజుకు రూ.257 చొప్పున వేతనం చెల్లించనున్నారు.

ఆసక్తి కలిగిన వారిని గుర్తిస్తున్నాం

ఆకవరం శ్రీనివాసకుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, హనుమకొండ జిల్లా

తొమ్మిదో విడత హరితహారాన్ని మరింత ఫలవంతం చేసేందుకు ప్రతి మండలంలో రెండు నర్సరీలను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందుకోసం ఆసక్తి కలిగిన మహిళా సంఘాల నుంచి వివరాలు తెప్పించుకొని వారిలో చురుకైన సంఘాలను గుర్తించి నర్సరీల నిర్వహణ విషయాన్ని వివరించాం. నర్సరీల నిర్వహణలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చి వారిని కలుపుకొని పోయేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. దీని అమలుకు కసరత్తు చేస్తున్నాం. మహిళలు మరింత ఎదగడానికి ఇదొక వేదికగా నిలుస్తుంది.

# తరచూ లీకేజీ.. సరఫరాలో ఇబ్బంది



ఇబ్రహీంపట్నం : మెట్‌పల్లి పట్టణ శివారులోని వెంకట్రావుపేట్ వద్ద మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ దెబ్బతిని లీకేజీ ఏర్పడింది. లీకేజీ మరమ్మతుల నిమిత్తం జిల్లా అంతటా రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాను నిలిపి వేశారు. ఇలా ప్రధాన పైపులైన్‌కు పలుమార్లు లీకేజీలు ఏర్పడి మరమ్మతు పనులు ముగిసే వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో భగీరథ నీటిపై ఆధారపడిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


5 పట్టణాలు.. 13 మండలాలు

ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామశివారులో మిషన్ భగీరథ ప్రధాన గ్రిడ్ ఏర్పాటుచేశారు. ఇక్కడ శుద్ధి చేసిన తాగునీటిని పైపులైన్ల ద్వారా జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు 13 మండలాల్లోని గ్రామాలకు నిత్యం తాగునీటిని సరఫరా చేస్తుంటారు. నీటిని సరఫరా చేయడానికి 1130 కి.మీ ప్రధాన, 2200 కి.మీ అంతర్గత పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టారు. కాగా పలు కారణాలతో నిత్యం ఏదో ఓ చోట పైపులైన్ లీకేజీకి గురై నీరు వృథాగా పోతున్నాయి. ప్రధాన పైపులైన్‌కి మరమ్మతు పనులు చేయడానికి రెండ్రోజుల వరకు సమయం పడుతుండడంతో నీటి సరఫరాలో అంతరాయం తప్పడం లేదు.

భగీరథ నీరే దిక్కు

పైప్‌లైన్ల లీకేజీ మరమ్మతు పనుల వల్ల నీటి సరఫరా నిలిపి వేస్తుండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో గతంలో బావులు, బోరు బావుల ద్వారా నీటిని ట్యాంకులకు ఎక్కించి అక్కడి నుంచి ప్రజలకు అందించేవారు. కొన్నేళ్లుగా మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తుండడంతో వాటిని నిలిపివేశారు. కొన్ని గ్రామాల్లో భగీరథ నీటితోపాటు పాత పద్ధతిలోనూ నీటిని అందిస్తున్నారు. భగీరథ నీరు నిలిచిన సమయాల్లో పాత పద్ధతిలోనే ప్రజలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. పట్టణాల్లో మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. కొన్నిచోట్ల రోజు విడిచి రోజు నీటిని అందజేస్తున్నారు. సమయం కేటాయించక పోవడంతో కొన్ని ఏరియాల్లో గంటల తరబడి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో శుద్ధజలం మురుగు కాలువల్లో, రోడ్లపై వృథాగా పోతోంది. పట్టణాల్లోని అంతర్గత పైపులైన్ తరచూ దెబ్బతింటుండడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటం సర్వసాధారణంగా మారింది. భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా ప్రారంభమైనప్పటి నుంచి పట్టణాల్లో పాత పద్ధతిని నిలిపివేశారు. భగీరథ ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా పట్టణ ప్రజలను తాగునీరు అందకుండా పోనుంది.

# సర్కారు బడులకు క్రీడా నిధులొచ్చాయ్!



పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో సరైన శిక్షణ లేక విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. పలు చోట్ల వ్యాయామ ఉపాధ్యాయులున్నా క్రీడా వసతులు కరవయ్యాయి. ఫలితంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నిరాశే ఎదురవుతోంది. పాఠశాలలకు క్రీడా నిధులు రాకపోవడంతో దాదాపుగా పదేళ్లుగా విద్యార్థులు ఆటలకు దూరం కావాల్సి వస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత సర్కారు బడులకు 'క్రీడా నిధి' పేరిట నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేరుగా పాఠశాలల యాజమాన్య కమిటీ ఖాతాలో జమవుతున్నాయి. ఈ నిధులతో క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున కేటాయించారు. నిధుల రాకతో క్రీడా సామగ్రి కొరత తీరనుంది.

నామమాత్రంగా పోటీల నిర్వహణ

ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి గతంలో క్రీడల నిర్వహణ రుసుం వసూలు చేసేవారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఈ రుసుం రద్దయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు నిధులను భరిస్తున్నాయి. పదేళ్లుగా క్రీడల కోసం నిధులు లేకపోవడంతో ఆటలు మరుగునపడ్డాయి. పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్)కు ఆదరణ కరవైంది. మండల స్థాయిలో పోటీలు నిర్వహించి, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేవారు. నిధుల లేక ఈ పోటీలు నామమాత్రంగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల దాతల సహకారంతో అరకొరగా నిర్వహిస్తున్నారు.

పదేళ్ల నిరీక్షణకు తెర

క్రీడా నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న పాఠశాలల్లో పదేళ్ల నిరీక్షణకు తెరపడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,399 పాఠశాలలు ఉండగా ఇందులో ప్రాథమిక 1,532, ప్రాథమికోన్నత 279, ఉన్నత పాఠశాలలు 588 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.62 కోట్లు మంజూరు కావడంతో త్వరలో కీడా సామాగ్రి అందుబాటులోకి రానుంది. ఆటల్లో విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టనున్నారు. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవితో మాట్లాడగా ఆటలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. మంజూరైన క్రీడా నిధులు పాఠశాల యాజమాన్య కమిటీ ఖాతాల్లో జమ అవుతున్నాయని, ఆ నిధులతో క్రీడా సామగ్రి కొనుగోలు చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

కొనుగోలు చేసే సామగ్రి ఇదే..

నిధులు లేక పాఠశాలల్లో క్రీడా సామగ్రి అందుబాటులో ఉండటం లేదు.

తాజాగా మంజూరైన నిధులతో వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్‌బాల్, క్రికెట్ బ్యాట్లు, బాస్కెట్‌బాల్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, రగ్బీబ్యాగ్స్, స్కిప్పింగ్ రోప్స్, త్రోబాల్ సామగ్రి కొనుగోలు చేస్తారు.

ప్రథమ చికిత్స కిట్లు, పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు సమకూరుస్తారు.

# నిరాశ్రయులపై చిన్నచూపేల?

కరీంనగర్ : అనాథలకు సొంతిల్లుగా మారిన నిరాశ్రయుల కేంద్రంపై నిర్లక్ష్యం వీడటం లేదు. సౌకర్యాలు లేకపోవడంతో ఆశ్రయం పొందుతున్న వారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఎప్పటికప్పుడూ మరమ్మతులు లేకపోగా అక్కడికి వచ్చే వారు మరెప్పుడైన రావడానికి జంకుతున్నారు.

ఏళ్లుగా తప్పని ఇబ్బందులు

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాన్ని కట్టరాంపూర్‌లో ఏర్పాటు చేశారు. రోడ్ల మీద భిక్షాటన చేసే వారు, రాత్రివేళ కూడళ్లలో, బస్టాండ్‌లలో నిద్రించకుండా ఇక్కడికి వచ్చి ఆశ్రయం పొందేందుకు వీలుగా ప్రభుత్వ భవనంలో వసతి కల్పించారు. ప్రస్తుతం ఇందులో దివ్యాంగులు, మతిస్థిమితం లేని వారు, వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారికి ఆవాసంగా మారింది. వీరందరి కోసం ఓ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకుడు నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. అందులో కనీస సౌకర్యాలు లేకపోగా ఏళ్ల తరబడి అలాగే నెట్టుకొస్తుండగా వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అధ్వానంగా ప్రాంగణం

నిరాశ్రయుల కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పించాల్సిన అధికారులు హడావుడి చేయడం తప్ప సౌకర్యాలు మాత్రం మెరుగు పర్చడం లేదు. స్నానాల గదుల తలుపులు విరిగిపోయాయి. ఉన్న మరుగుదొడ్లు చెడిపోయాయి. ఛాంబర్లు నిర్మించగా అవి ఎత్తుగా ఉన్నాయి. మురుగు నీరంతా బయటకు వచ్చి దుర్గంధంగా మారుతోంది. బోర్ లేకపోవడంతో ట్యాంకర్ నీటి కోసం ఎదిరి చూడాల్సి వస్తోందని నిరాశ్రయులు తెలిపారు. డబ్బాలలో నింపిన కొన్ని సందర్భాల్లో సరిపోవడం లేదంటున్నారు. కొద్ది దూరం సీసీ వాకిలి లేకపోవడంతో దుమ్ము, ధూళి వచ్చి అవస్థలు పడుతున్నారు.

నిధులున్నా..

జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక నిరాశ్రయుల కేంద్రంపై అధికారులు చిన్నచూపు ప్రదర్శిస్తున్నారు. అందులో ఎప్పటికప్పుడూ వసతులు కల్పించాల్సి ఉండగా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రగతి నిధులు రూ.7 లక్షలతో మూడు నెలల కిందట టెండర్లు పిలిచారు. నిరాశ్రయుల కేంద్రంలో బోర్‌వెల్, పెయిటింగ్, బాత్రూమ్‌ల మరమ్మతులు, వర్షం నీరు నిలవకుండా



మొరం నింపడం వంటి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ పనులు చేసేందుకు నిధులుండగా ఆ పనులు మాత్రం జరగడం లేదు.

షెడ్డులోనే వంటగది

ఆశ్రయ కేంద్రంలో నిరాశ్రయులకు భోజన సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా వంటగది లేకపోవడంతో చిన్నపాటి రేకుల గుడిసె వేశారు. అక్కడ వండుకొని వరండాలో తీసుకొచ్చి భోజనాలు చేస్తున్నారు. కిచెన్ కోసం గది లేకపోవడం, వర్షం వస్తే వండుకోవడం ఆలస్యమవుతోంది. డైనింగ్ లేకపోవడంతో భోజన సమయంలో ఏవరికి వారు వేసుకొని తినాల్సిన దుస్థితి నెలకొంది.

వసతుల కల్పనకు టెండర్లు – డి.కిష్టప్ప, ఈఈ, నగరపాలిక

నిరాశ్రయుల కేంద్రంలో మౌలిక వసతులు కల్పించేందుకు టెండర్లు నిర్వహించాం. సదరు గుత్తేదారు ఒప్పందం చేసుకోవడంతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

# రోగం ఇంతింతైనా.. సౌకర్యం అంతంతే..!

నల్గొండ : జిల్లా కేంద్రంలోని బహార్‌పేటకు చెందిన 44 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడింది. క్యాన్సర్ నాలుగో దశకు చేరడంతో బాధితులు జనరల్ ఆసుపత్రి ఆలన వార్డులో చేర్చారు. చికిత్స పొందిన ఆమె వారం రోజుల తర్వాత మృత్యువాత పడింది. కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను ఇంటికి తీసుకెళ్లకపోవడంతో రెండు రోజులు పోస్టుమార్టం గదిలో ఉంచి..ఆ తర్వాత మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు. దేరకొండ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. దీనికోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. కానీ ఆరు నెలల వ్యవధిలోనే మృత్యువాత పడింది. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి బాధితుల సంఖ్య అధికంగానే ఉంటోంది.

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి ఏటికేడు పెరుగుతోంది. మహిళల్లో వచ్చే క్యాన్సర్లు సైతం ఎప్పటికప్పుడు భయాందోళనకు గురి చేస్తున్నాయి. బాధితుల సంఖ్య క్రమేణా పెరుగుతున్నా.. ప్రత్యేక వైద్యులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా అందుబాటుల్లో లేక పోవడం విచారకరం. నల్గొండ, సూర్యాపేటలో వైద్యకళాశాలు అందుబాటులోకి వస్తే క్యాన్సర్ లాంటి రోగాలకు శస్త్రచికిత్సలు, కీమోథెరఫి లాంటి వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎదురు



చూసినా.. బాధితులకు మాత్రం నిరాశే మిగిలింది. ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు కన్పించినా స్థానికంగా ఉండే జనరల్ ఫిజీషియన్ల సూచనతో మాత్రలు వాడడం, లేదంటే హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. జిల్లాలో క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల బాధితులు 380 మంది ఉన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధితులు 461 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. లెక్కల్లోకి రానివారు కూడా అధికంగానే ఉంటారు.

ఆలన' ద్వారా చికిత్స అందిస్తున్నాం– డా.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, నల్గొండజిల్లాలో ఆలన కింద క్యాన్సర్ బాధితులకు అనుభవం ఉన్న ఎంబీబీఎస్ వైద్యులతో చికిత్స అందిస్తున్నాం. ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి అవగాహనతో పాటు మాత్రలు అందజేస్తున్నాం. దీంతో పాటు క్యాన్సర్ దశ నాలుగో స్థాయికి వచ్చిన వారికి చికిత్స అందిస్తున్నాం. చివరి జీవితంలో బాధితులు ఇబ్బంది పడకుండా ఇక్కడ చికిత్స అందించడంతో పాటు పౌష్టిక ఆహారం పెడతున్నాం. వారి వెంట వచ్చేవారిలో ఒకరికి కూడా ఇక్కడ భోజనం ఇస్తున్నాం.

# మన జిల్లాలోనే కూలీలెక్కువ..!

నల్గొండ : రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే కౌలురైతులెక్కువ అని వెల్లడించిన రైతు స్వరాజ్య వేదిక (స్వచ్ఛంద సంస్థ) అధ్యయన నివేదిక.. ఆ కౌలు రైతుల్లోనూ ఎక్కువ మంది వ్యవసాయ కూలీలేనని పేర్కొంది. ఒక్క నల్గొండ జిల్లాలోనే మొత్తం కౌలు రైతుల్లో 82.30 శాతం మంది వ్యవసాయ కూలీలున్నారని తెలిపింది. సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ఇది 50శాతం కంటే తక్కువగా ఉంది. రైతు, పలు ప్రజా సంఘాలు గతంలో ఉమ్మడి జిల్లాలో జరిపిన సర్వే ప్రకారం మొత్తం 11.5 లక్షల మంది రైతులుండగా..ఇందులో సుమారు రెండున్నర లక్షల మంది కౌలు రైతులున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదు. ఎక్కువగా మునుగోడు, నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో కౌలు రైతులుండగా..ఆయకట్టు ప్రాంతమైన హుజూర్‌నగర్, కోదాడ నియోకజవర్గాల్లో గతంతో పోలిస్తే కొంత మేర తగ్గారు. గత ఆరేళ్లుగా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో కౌలు ధరలు గతంతో పోలిస్తే రెట్టింపయ్యాయి. దీంతో చాలా మంది కౌలు మానేసి వ్యవసాయ కూలీలుగా మారారు. కొంత మంది గతంలో కౌలు ఇవ్వగా, ప్రస్తుతం వారే స్వయంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలన్నీ కౌలు రైతులు మరింత కూలీలుగా మారడానికి కారణమయ్యాయని అధ్యయన నివేదిక అభిప్రాయ పడింది. ఈ వ్యవసాయ కూలీల్లోనూ చాలా మందికి అర ఎకరం కంటే తక్కువగానే భూమి ఉంది. దీంతో వీరంతా ఆర్థిక వృద్ధి కోసం కూలీలుగా ఇతరుల పొలాల్లో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ కూలీ తర్వాత ఎక్కువ మంది ఆధారపడింది పాడిపరిశ్రమలోనేనని నివేదిక వెల్లడించింది.

తొలి వీధి దీపం వెలిగిందిక్కడే

నిజాం నవాబులు తొలిసారి జనరేటర్‌తో వీధి దీపం వెలిగించింది గుర్రంపోడు మండలం సుల్తాన్‌పురంలోనే. ఆనాటి నిజాం సుల్తానుకు కేంద్ర కార్యాలయం వారు లేఖ రాస్తూ.. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అయితే ఇక్కడే ఓ చిన్న పొరపాటు దొర్లింది. హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌కు బదులుగా సుల్తాన్‌పురం అని లేఖలో తప్పుగా అచ్చుయింది. నిజాం అధికారులు సుల్తాన్‌పురం ఎక్కడ ఉందో ఆరా తీసి చింతపల్లి సమితి పరిధిలో (ప్రస్తుతం గుర్రంపోడు మండలం) సుల్తాన్‌పురం ఉన్నట్లుగా గుర్తించి వెంటనే ఇసుపస్తంభాలు తెప్పించి గ్రామంలో అన్నివీధుల్లో పాతించారు. డీజిల్ జనరేటర్‌ను సుల్తాన్‌పురం పంపించి బిగించారు. డ్రమ్ముల కొద్దీ డీజిల్ కూడా తెప్పించారు. విద్యుత్తు దీపాలు కూడా ఏర్పాటు చేసి జనరేటర్ సాయంతో వెలిగించారు. ఆ రోజుల్లో జనం వచ్చి ఈ దీపాలను చూసి ఆశ్చర్యపోయారట. అయితే జరిగిన తప్పిదం తెలుసుకొన్న అధికారులు ఇక్కడి జనరేటర్, ఇసుప స్తంభాలు, వీధిదీపాలను తీసుకెటళ్లేందుకు సుల్తాన్‌పురం రాగా ఇక్కడ జనం అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనక్కు వెళ్లిపోయి సుల్తాన్‌బజార్‌లో కరెంటు దీపాల ఏర్పాటు చేశారు. సుమారు మూడు నెలల పాటు జనరేటర్ సాయంతో దీపాల వెలుగులు కొనసాగాయని, కొంతకాలం తర్వాత అధికారులు వచ్చి జనరేటర్‌ను తీసుకువెళ్లారని గ్రామస్థులు చెబుతున్నారు. ఆనాడు పాతిన కరెంటు ఇనుపస్తంభాలు నాటి సంఘటనకు గుర్తుగా గ్రామవీధుల్లోనే ఉన్నాయి.



# ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణానికి జగన్ భూమి పూజ

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలోని కృష్ణాయపాలెంలో సీఎం జగన్ పర్యటించారు. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల ప్రాజెక్టులకు సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మోడల్ హౌస్‌ను జగన్ పరిశీలించారు. ఆ తర్వాత వెంకటపాలెం వెళ్లిన సీఎం.. అక్కడ నిర్వహించనున్న బహిరంగసభలో పాల్గొన్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో వెంకటపాలెంలోని రైతుల దీక్షా శిబిరం వద్ద పోలీసులు మోహరించారు. రైతులు బయటకు రాకుండా ఆంక్షలు విధించారు. శిబిరంలో మైకు ఆపివేయాలని పోలీసులు కోరగా.. దానికి రైతుల నిరాకరించారు. మైకు ఆపేదేలేదని తేల్చిచెప్పారు. సీఎం సభ కోసం వచ్చిన బస్సులు సీడ్ యాక్సెస్ రోడ్‌లోనే ఆపివేయడంతో సభకు వచ్చిన ప్రజలు సుమారు రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లారు.

**రాను పోను 25 కి.మీ కూడా ఉండదు.. అయినా హెలికాప్టర్‌లోనే..**

సీఎం జగన్ తన ఇంటి నుంచి రానుపోను పట్టుమని 25 కి.మీ కూడా లేని ఈ పర్యటనకు హెలికాప్టర్‌లో రావడం చర్చనీయాంశమైంది. తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 9 కి.మీ దూరంలోని మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలోని ఆర్5జోన్ లేఔట్‌లో ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 6 కి.మీ దూరంలోని వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. తిరిగి అక్కడి నుంచి సీఎం ఇంటికి 10 కి.మీ దూరమే. మొత్తం మీద చూసుకున్నా 25 కిలోమీటర్లే. ఈమాత్రం దూరానికి కూడా జగన్ హెలికాప్టర్‌లో ప్రయాణించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆర్-5 జోన్‌లో ఇళ్ల పేరుతో పేదలను జగన్ మోసం చేస్తున్నారు: అమరావతి రైతులు**

**సీఎం సభకు బస్సులు.. విజయవాడలో ప్రయాణికుల అవస్థలు :**

మరోవైపు మంగళగిరి మండలం కురగల్లులో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సీఎం సభకు అదే మార్గంలో భారీగా బస్సులు రావడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

అమరావతిలో సీఎం సభకు ఆర్టీసీ బస్సులను అధికారులు తరలించడంతో విజయవాడ బస్టాండులో సిటీ బస్సుల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తున్నారు. బస్సుల్లేక విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వేపై స్టే

దిల్లీ: కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. వారణాసి కోర్టు ఇచ్చిన ఈ సర్వే ఆదేశాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. రెండు రోజుల పాటు అంటే జులై 26 సాయంత్రం 5 గంటల వరకు మసీదు ప్రాంగణంలో ఎలాంటి సర్వే చేపట్టరాదని ఆదేశించింది. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని వారణాసి కోర్టు గతవారం కీలక తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు భారత పురావస్తు విభాగ అధికారుల బృందం సోమవారం సర్వే ప్రారంభించింది. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వారణాసి కోర్టు సర్వే ఆదేశాలపై స్టే విధించాలని కోరింది. ఈ పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం నేడు అత్యవసర విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం విచారణ జరుపుతూ.. సర్వే సమయంలో మసీదు ప్రాంగణంలో పురావస్తు అధికారులు తవ్వకాలు చేపడతారా? అని కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనికి కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. "ఒక్క ఇటుకనూ తొలగించట్లేదు. అలాంటి ప్రణాళిక కూడా లేదు. ప్రస్తుతానికి అక్కడ కేవలం కొలతలు, ఫొటోగ్రఫీ, రాడార్ ప్రక్రియ మాత్రమే కొనసాగుతోంది. ఇది మసీదు నిర్మాణాలపై ఎలాంటి ప్రభావం చూపించదు" అని కోర్టుకు తెలిపారు. మసీదు ప్రాంగణంలో నిర్మాణాల తొలగింపు లేదా తవ్వకాలు చేపట్టట్లేదని ఎస్‌జీ పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సీజేఐ ధర్మాసనం.. సర్వేపై స్టే విధించింది. జులై 26 వరకు మసీదు ప్రాంగణంలో ఎలాంటి శాస్త్రీయ సర్వే చేపట్టరాదని స్పష్టం చేసింది. వారణాసి కోర్టు ఆదేశాలపై మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతినిచ్చింది. మొగల్ కాలంలో హిందూ ఆలయ స్థానంలో ఈ మసీదు నిర్మితమైందని, ఈ విషయాన్ని సర్వే నిర్వహించి నిర్ధారించాలని కోరుతూ నలుగురు హిందూ మహిళలు పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన వారణాసి కోర్టు.. మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని కీలక తీర్పు వెలువరించింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీల్ చేసిన వజూఖానా ప్రాంతాన్ని మినహాయించి మసీదు ప్రాంగణమంతా కార్బన్ డేటింగ్, ఇతర పద్ధతుల ద్వారా శాస్త్రీయ సర్వే నిర్వహించాలని భారత పురావస్తు విభాగాన్ని ఆదేశించింది.

# పేదల ఇళ్లకు చంద్రబాబు, దత్తపుత్రుడు అడుగడుగునా అడ్డుపడ్డారు




గుంటూరు: ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా.. ఇళ్లు కట్టించి ఇవ్వకుండా అడ్డుతగిలిన ప్రబుద్ధులు ఉన్నారు. ఒక చంద్రబాబు, ఒక ఈనాడు, ఒక ఆంధ్రజ్యోతి, ఒక టీవీ5, ఒక దత్తపుత్రుడు.. వీళ్లకు తోడు చంద్రబాబు పుట్టించిన ఊరు-పేరు లేని సంఘాలు. వీళ్లంతా పేదవాడికి ఇల్లు రాకూడదని ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి మన రాష్ట్రంలోనే చూశాం. ఇలాంటి దుర్మార్గమైన రాజకీయ పార్టీలను ఎక్కడా చూడలేదు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి.. పట్టాలు అందించి.. మోడల్ హౌజ్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారాయన. అనంతరం వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. "ఇవాళ రాష్ట్ర చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోయే రోజు. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు.. పేదలందరికీ ఈరోజు మరిచిపోలేనిది. పేదల శత్రువులపై పేదలు సాధించిన విజయం ఇది. ఇళ్లు కట్టిస్తానని గతంలో చంద్రబాబు మోసం చేశారు. పేదవాడికి ఇల్లు రాకూడదని.. అడ్డుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. దీనికోసం సుప్రీం కోర్టు దాకా వెళ్లి మరీ ప్రయత్నించారు. ఇలాంటి పరిస్థితి మరెక్కడా రాకూడదు".. ఇవాళ పేదల విజయంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. పేదల వ్యతిరేకులంతా 18 కేసులు వేశారు. ఇందుకోసం ఎక్కడని గడపంటూ లేదు. మూడేళ్ల తరపున మీ కోసం పోరాటం చేశాం. అందుకే.. ఇది పెత్తందారుల మీద పేదల ప్రభుత్వం సాధించిన విజయం. రాక్షస బుద్ధితో ఉన్నవారితో మనం యుద్ధం చేస్తున్నాం. ఈ పెత్తందారులు.. పేదవాడికి ఇంగ్లీష్ మీడియం అవసరమా? అని ప్రశ్నించిన వాళ్లు.. తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివిస్తారు. సంక్షేమం అందిస్తుంటే రాష్ట్రం శ్రీలంక అవుతుందంటూ ప్రచారం చేస్తారు.

మరి చంద్రబాబు తన హయంలో పేదలకు ఉపయోగపడే పనులు ఎందుకు చేయలేదు అని సీఎం జగన్ నిలదీశారు. పేద పిల్లలు బాగుపడడం వాళ్లకు ఇష్టం లేదు. పెత్తందారుల బుద్ధి ఎలా ఉందో గమనించండి అంటూ ఏపీ ప్రజలకు సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.



# ఆర్-5 జోన్‌లో ఇళ్ల పేరుతో.. పేదలకు జగన్ మోసం

తుళ్లూరు : ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదలను సీఎం జగన్ మోసం చేస్తున్నారని అమరావతి ప్రాంత రైతులు ఆరోపించారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణాయపాలెం పరిధి ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులకు శంకుస్థాపనకు సీఎం జగన్ నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని పరిధిలోని గ్రామాల్లో రైతులు ఆందోళనకు దిగారు. కృష్ణాయపాలెం, తుళ్లూరు శిబిరాల వద్ద నల్ల జెండాలు, బెలూన్లతో నిరసన చేపట్టారు. ఆర్-5 జోన్ అంశంపై హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణంపై ముందుకెళ్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులంటే జగన్‌కు పట్టింపు లేదని మండిపడ్డారు. "పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి.. సీఎం గోబ్యాక్.. చెల్లని పట్టాలతో పేదలను మోసం చేయొద్దు.. ఆర్-5 జోన్‌ను వెంటనే రద్దు చేయాలి" అంటూ రైతులు నినాదాలు చేశారు. "అమరావతి రైతులను కావాలనే ఇబ్బందిపెడుతున్నారు. కోర్టులంటే సీఎం జగన్‌కు పట్టింపు లేదు. రాజధాని రైతులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. అమరావతి రైతుల సమాధుల పైనుంచి ఎన్నికులకు వెళ్తున్నారు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో సీఎం పర్యటన నేపథ్యంలో పలువురు ఐకాస నేతలు పోలీసులు గృహనిర్బంధం చేశారు.

# జగన్ రాకతో ఫ్లెక్సీల ఏర్పాటు... నవ్వుకుంటున్న జనాలు.. ఇంతకీ అందులో ఏముందంటే?




అమరావతి: గుంటూరు జిల్లా కృష్ణయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి జనాలు నవ్వుకుంటున్న పరిస్థితి నెలకొంది. సీఎం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆచితూచి ఎలాంటి అక్షర దోషాలు లేకుండా వేయాల్సి ఉంటుంది. అయితే కృష్ణాయపాలెంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒక్క అక్షర దోషం మొత్తం అర్థాన్నే మార్చేసిన వైనం నెలకొంది. అసలేం జరిగిందంటే.. కృష్ణాయపాలెంలో సీఎం జగన్ రాక సందర్భంగా పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం దగ్గర ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అక్షర దోషాలు అర్థాలను మార్చేశాయి. పేదలను పెద్దోళ్ళుగా చేయడం అనడానికి బదులు... "పేదోళ్లు"గా అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అలాగే చారిత్రాత్మకంను "చార్రితాత్మకం" అంటూ ఫ్లెక్సీలో ముద్రించడంపై జనాలు నవ్వుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న మార్గంలోని ముఖద్వారం వద్ద ఫ్లెక్సీలో అక్షర దోషాలు దొర్లాయి. మరోవైపు ఈరోజు గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతంలో సీఎం జగన్ పర్యటించనున్నారు. సీఆర్డీఏ పరిధిలో కృష్ణాయపాలెం జగనన్న లే అవుట్‌లో పేదల ఇళ్ళ నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9:30 గంటలకు హెలీకాప్టర్‌లో తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కృష్ణాయపాలెం హౌసింగ్ లే అవుట్‌కు జగన్ చేరుకోనున్నారు. అక్కడ వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం ఇళ్ళ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. అక్కడే మోడల్ హౌస్‌ను పరిశీలించిన అనంతరం హెలికాప్టర్‌లో వెంకటపాలెంకు చేరుకోనున్నారు. అక్కడ లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొంటారుకార్యక్రమం తర్వాత అక్కడి నుంచి తిరిగి హెలీకాప్టర్ లో మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి సీఎం జగన్ చేరుకోనున్నారు. కాగా.. సీఎం కార్యక్రమానికి భారీగా విద్యాసంస్థల బస్సుల్లో జనాలను అధికారులు తరలించనున్నారు. విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని బస్సులు ఇవ్వలేమని కళాశాలల యాజమాన్యాలు చెప్పినప్పటికీ బస్సులు ఇవ్వాల్సిందేనని యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకువచ్చారు.

స్కూళ్లు, కళాశాలల బస్సులు మొత్తాన్ని తీసుకొని జనాలను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గుంటూరు , విజయవాడ , పెదకాకాని, మంగళగిరి , తాడేపల్లి, దుగ్గిరాల నుంచి సీఎం సభకు జనాన్ని అధికారులు బస్సుల్లో తరలిస్తున్న పరిస్థితి.

# నారా లోకేష్ పాదయాత్రతో ఇబ్బంది లేదు.. విజయసాయిరెడ్డి తనను కలవడంపై..



ప్రకాశం : ఎంపీ విజయసాయిరెడ్డి తనను కలవడంపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. విజయసాయిరెడ్డి తనను స్నేహపూరితంగా వచ్చి కలిశారని వెల్లడించారు. తమ మధ్య రాజకీయ అంశాలు చర్చ జరగలేదన్నారు. ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బాధ్యతలు విజయసాయిరెడ్డికి అప్పగిస్తారన్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితులపై చర్చించామని తెలిపారు.

పార్టీలో ప్రక్షాళన సీఎం జగన్ చేస్తారన్నారు. కష్టపడి పని చేసే వాలంటీర్లను విమర్శించడం కరెక్ట్ కాదన్నారు. నారా లోకేష్ పాదయాత్రతో తమకు ఇబ్బంది లేదన్నారు. లోకేష్ పాదయాత్ర ఎక్కడా మేం ఆపలేదని బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్ రెడ్డి సమీప బంధువైన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీలో అసంతృప్తితో రగిలిపోతున్న సంగతి తెలిసిందే. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కో-ఆర్డినేటర్‌గా బాలినేని రాజీనామా చేయడం అప్పట్లో పెను సంచలనమే అయ్యింది. ఆ మధ్య ఆయనకు మళ్లీ మునుపటి రోజులొచ్చాయని.. ఇక అన్నీ మొదలెట్టేశారని వార్తలు వినిపించినప్పటికీ అవన్నీ రూమర్స్‌కే పరిమితం అయ్యాయి. అలా వార్తలు వచ్చిన మరుసటిరోజే బాలినేని ఫ్లెక్సీలో వైఎస్ జగన్‌తో పాటు జిల్లా మంత్రులు ఎవరి ఫొటోలు కనిపించపోవడం.. కార్యకర్తలను జగన్ సరిగ్గా పట్టించుకోవట్లేదని ఆరోపణలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో బాలినేని ఇంకా కూల్ అవ్వలేదని వార్తలు గుప్పుమంటూనే ఉన్నాయి. అయితే.. బాలినేని రాజీనామా చేసిన కో-ఆర్డినేటర్ పదవికి వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని సెలక్ట్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో బాలినేనిని విజయసాయిరెడ్డి కలవడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది.

# కుట్రతోనే గన్‌మెన్లు తొలగించారు



గుంటూరు: జగన్ సీఎం అయ్యాక ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీ నారాయణ ధ్వజమెత్తారు. వైసీపీ సర్కార్ గన్‌మెన్ల తొలగించడంపై మీడియాతో మాట్లాడారు. "కుట్రలో భాగంగానే నాకు గన్‌మెన్లను తొలగించారు. ప్రభుత్వాన్ని గట్టిగా విమర్శిస్తున్నానని ఇలాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడింది.

పల్నాడు జిల్లాలో భద్రతపరంగా నాకు ఇబ్బందులు ఉన్నా గన్‌మెన్లను విత్ డ్రా చేశారు. ప్రజలు జగన్‌కు మంచి మెజార్టీ ఇచ్చినా ఉపయోగించుకోలేకపోయారు.

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుట్రలు, కుతంత్రాలు, అవినీతి, దోపిడీ, హత్యలు తప్ప మరో కార్యక్రమం లేదు. ఎంత త్వరగా ఎన్నికలు వస్తే అంత త్వరగా జగన్‌ను ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు." అని కన్నా వ్యాఖ్యానించారు.

# అమ్మఒడి కోసం కురుపాం సభకు విద్యార్థుల తరలింపుపై హైకోర్టులో పిల్



అమరావతి: అమ్మఒడి కార్యక్రమం కోసం కురుపాం సభకు విద్యార్థినీ విద్యార్థులను తరలించడంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆదివాసి హక్కుల పోరాట సమితి తరపున న్యాయవాది జడ శ్రవణ పిటిషన్ వేశారు. ప్రభుత్వం లేదా రాజకీయ సభలకు పిల్లలను తరలించవద్దని 2019లో హైకోర్టు ఆదేశాలు చేసింది. ఇలా తరలిస్తే పిల్లల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినట్లేనని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా కురుపాం సభకు వేలాది మంది విద్యార్థులను అధికారులు తరలించారు. విద్యార్థులను తరలించామని ఇప్పటికే ఆర్‌టీఐ ద్వారా పిటిషనర్‌కు విద్యాశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. ఆర్‌టీఐ సమాచార కాపీలను పిటిషన్‌కు పిటిషనర్ జత చేశారు. కురుపాం సభలో ముఖ్యమంత్రి జగన్ రాజకీయ ఉపన్యాసం కూడా పెన్‌డ్రైవ్‌లో కోర్టుకు సమర్పించారు. కురుపాం సభలో సీఎం జగన్ ప్రసంగాల్లో పెళ్ళాల గొడవను ప్రస్తావించిన అంశాన్ని కూడా పిటిషనర్ లేవనెత్తారు. స్కూల్ పిల్లలకు పెళ్ళాలు, పెళ్ళిళ్లు, రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వటం ఏంటని పిటిషనర్ ప్రశ్నించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ హోం సెక్రటరీని ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు.

# పేదల సొంతింటి కల సాకారమైంది :ఎమ్మెల్యే ఆళ్ల

వెంకటాయపాలెం: పేదల సొంతింటి కల ఇవాళ సాకారమైందని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదని చంద్రబాబు కుట్రలు చేస్తే వాటిని ఛేదించి పేదల దశాబ్దాల కలను నెరవేర్చిన రోజు ఇదన్నారు. వెంకటాయపాలెంలో ఏర్పాటు చేసిన ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు.

**ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏమన్నారంటే..** అన్నా.. పేదల దశాబ్దాల కల ఇది. ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలనే మీ సంకల్పం చాలా గొప్పది. అన్నా..మీ దయ వల్ల ఇప్పటికే రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మంగళగిరి%--%తాడికొండలో పేదలు ఉండకూడదని చంద్రబాబు రైతుల ముసుగులో దళారులను ప్రోత్సహించి కోర్టుల్లో కేసులు వేసినా కూడా మీకు భగవంతుడు తోడుగా ఉండటంతో మీరు పేదలకు అండగా ఉండటం అనేది ఈ ప్రాంత ప్రజలకు అదృష్టం. సుమారు నెల రోజుల క్రితం ఈ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆ రోజు ఒక మాట ఇచ్చారు. రాజకీయాల్లో ఒక మాట ఇస్తే కట్టుబడి ఉండాలని, దాని కోసం ఎందాకైనా వెళ్లాలనే మీ సంకల్పానికి నిదర్శంగా ఈ రోజు ఇళ్ల నిర్మాణాల మంజూరు పత్రాలు అందించడం అనేది నిజంగా ఈ ప్రాంత ప్రజలందరి అదృష్టంగా భావిస్తున్నాం.

ఒకానొక సమయంలో ఈ ప్రాంతంలో ఇళ్లు అద్దెకు కావాలంటే కూడా నీ కులం, మతం ఏంటని అడిగిన రోజులు ఉండేవి. ఈ రోజు ఆ పేదలందరూ జగనన్న ఇచ్చిన ఇల్లు మానవత్వంతో కూడుకుని ఉ ందని సగర్వంగా చెప్పుకుంటున్నారు. అతి త్వరలోనే పేదలు ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని సంతోషంగా గృహ ప్రవేశాలు చేసుకునేలా మీరందరూ కూడా వారికి అండగా నిలబడాలని మనసారా కోరుకుంటూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముగించారు.

## హాట్ లుక్స్ లో హీటెక్కిస్తోన్న అవికా!

టాలీవుడ్ లో అవికాగోర్ వేగం తగ్గిన సంగతి తెలిసిందే. ఛాన్సులు వస్తే చేయడం లేదంటే? ఇతర భాషల్లో సినిమాలు చేయడం తప్ప! అవికా కోసమంటూ అవకాశాలు లేవిక్కడ. ఈ ఏడాది పాప్ కార్న్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ సినిమా వైఫల్యం తర్వాత అమ్మడు తెలుగులో కనిపించలేదు. చెన్నై..ముంబై అంటూ కొత్త అవకాశాల కోసం చక్కెర్లు కొడుతుంది. అలాగే అమ్మడు సోషల్ మీడియాలో కూడా పెద్దగా యాక్టివ్ గా ఉండదు. గ్లామర్ పాత్రల వైపు తొలి నుంచి అనాసక్తిగా ఉండే బ్యూటీ కాబట్టి సోషల్ మీడియాలో హీటెక్కించే ఫోటోలతో ట్రీట్ అన్నది ఊహించనది. ఆ మధ్య కాస్త స్కిన్ షో చేస్తుందని ప్రచారం ఊపందుకుంది. కానీ ఆ తర్వాత ఆ వేగాన్ని కొనసాగించలేదు. అవకాశాల కోసం పంథా మార్చుకోవడం దేనికి వస్తే చేస్తాం.. లేకపోతే ఇంట్లో కూర్చుంటాం అన్న తీరున



కనిపించింది. తాజాగా అమ్మడు ఒళ్లంతా కప్పేసుకున్న ఓ ఫోటో నెట్టింట దర్శనమించ్చింది. క్రీమ్ కలర్ షోల్డర్ డిజైన్ లో అమ్మడు వయ్యారంగా కెమెరాకి ఫోజులిచ్చింది. ఇందులో ఎద అందాలు హైలైట్ చేసింది. అదీ వైడ్ యాంగిల్ లో. కెమెరా కోసం ప్రత్యేకంగా ఇచ్చిన ఫోజు అది. ఇక అమ్మడి హాట్ లుక్స్ మాత్రం కుర్రాళ్లకి మత్తెక్కించడం ఖాయమే. చూపులతోనే వలపు బాణం విసిరేస్తోంది. కళ్లలోనే కావాల్సినంత స్టప్ ఉందనిపిస్తుంది. ముఖానికి లైట్ మ్యాకప్.. పెదాలకు లిప్ స్టిక్ పూసింది. అయితే అమ్మడు ఎంపిక చేసుకున్న చెవి బుట్టలు మాత్రం ఆమెని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఇలా ఎంత ముస్తాబైనా షరా మాములుగా చబ్బీలుక్ మాత్ర అలాగే హైలైట్ అవుతుంది. మునుపటి కన్నా ముఖంలో గ్లోనెస్ తగ్గింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అవికా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

## సామ్ బ్రేక్.. ఎంత ఆదాయం పోతుందో తెలుసా?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి తెలియనివారు ఎవరూ ఉండరేమో. ఆమె దాదాపు దశాబ్ధానికి పైగా సినిమాలు చేస్తూ, దక్షిణాది ప్రజలను అలరిస్తూ వస్తున్నారు. ఆమెకు రోజు రోజుకీ క్రేజ్ పెరుగుతుందే కానీ, తగ్గుతున్నది లేదు. ముఖ్యంగా, ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్‌సిరీస్‌లో తన నటనతో జాతీయ దృష్టిని ఆకర్షించినప్పటి నుండి సమంత క్రేజ్ రోజు రోజుకీ పెరిగిపోతోంది. అయితే, ఆమె తన అనారోగ్య కారణాల వల్ల సంవత్సరం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. చాలా మంది దర్శక నిర్మాతలు ఆమెతో సినిమాలు చేయాలని ఉత్సాహం చూపిస్తున్నా కూడా ఆమె మాత్రం సినిమాలు చేయడానికి అస్సలు సముఖతగా లేరు. ఆమె తన ఆరోగ్యం పూర్తిగా సెట్ అయ్యే



వరకు మళ్లీ ఎలాంటి సినిమా చేయాలని అనుకోవడం లేదు. అయితే, ఈ బ్రేక్ కి ముందు సమంత తన పారితోషకం పెంచేసింది. ఫ్యామిలీ మ్యాన్ 2 తర్వాత ఆమె తన రెమ్యూనరేషన్ ని రూ.10 కోట్లకు పెంచేసింది. ఆమె చివరగా ఖుషీ, సిటాడెల్ ల కోసం రూ.5 కోట్లు తీసుకుంది. అయితే, తాను ప్రస్తుతం సంవత్సరం పాటు బ్రేక్ తీసుకోవడంతో దాదాపు సమంత రూ30కోట్లు నష్టపోవాల్సి రావడం గమనార్హం. చేతిలో ఉన్న సినిమాలను వదులుకోవడంతో పాటు, ఆమె చేతిలో ఉన్న బ్రాండ్స్ కి కూడా దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో, సమంత కేవలం ఒక్క సంవత్సరం గ్యాప్ తీసుకోవడం వల్ల రూ.30కోట్ల నష్టం వాటిల్లుతోందని తెలిసి ఫ్యాన్స్ షాకౌతున్నారు, అయితే, ఆమె ఆరోగ్యం కంటే, ఈ డబ్బు ఎక్కువ కాదు అని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, సమంత మూవీలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ మాత్రం బాగా పెరిగింది. ఓర్మాక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో సమంత ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆమె అగ్ర తారలను వెనక్కి నెట్టి, మొదటి స్థానంలోకి చేరడం విశేషం. దేశంలోని స్టార్ల టాప్ ర్యాంకింగ్స్ ఇక్కడ ఉన్నాయి. వరుసగా సమంత (1) అలియా భట్ (2), దీపికా పదుకొణె (3), నయనతార (4), కాజల్ అగర్వాల్ (5) ఉన్నారు. టాప్ 10 జాబితాలో త్రిష (6), కత్రినా కైఫ్ (7), కియారా అద్వానీ (8), కీర్తి సురేష్ (9), రష్మిక మందన్న (10) చోటు దక్కించుకోవడం విశేషం.




## భగవంత్ కేసరి.. లియోతో బాలయ్య జోర్దార్ సమరం!




మాస్ కమర్షియల్ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ చేస్తున్న భగవంత్ కేసరి సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తప్పకుండా మరోసారి బాలయ్య బాక్స్ ఆఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేయడానికి రెడీ అవుతున్నట్లుగా ఫ్యాన్స్ అయితే ఎంతో నమ్మకంతో ఉన్నారు. అయితే ఈ సినిమా విడుదల తేదీ విషయంలో చాలా రకాలుగా వార్తలు వైరల్ అవుతున్న దారుణంలో చిత్ర యూనిట్ మొత్తానికి క్లారిటీ ఇచ్చింది. ఈ సినిమాను విజయదశమి కనుకగానే విడుదల చేస్తున్నట్లుగా ముందుగానే ఒక పోస్టర్ వదిలారు. అయితే ఇప్పుడు అధికారికంగా మరొక అద్భుతమైన పోస్టర్తో రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 19వ తేదీన గ్రాండ్ గా విడుదల చేయబోతున్నట్లు ఒక హై వోల్టేజ్ మాస్ పోస్టర్ను కూడా వదిలారు. భగవంత్ కేసరి ఆయుధ పూజతో గీ సారి దసరా జోర్దారుంటది.. అంటూ హడావుడి స్టార్ట్ చేశారు. ఇక నందమూరి బాలకృష్ణ ఈ సినిమాలో పవర్ఫుల్ క్యారెక్టర్ తో కనిపించబోతున్నాడు. అంతేకాకుండా మొదటిసారి ఆయన సినిమా మొత్తం కూడా ఒక తెలంగాణ భాషతో మాస్ ప్రేక్షకులకు మరింత కిక్ ఇవ్వబోతున్నాడు. పోస్టర్ చూస్తుంటేనే సినిమాలో మాస్ ఆడియన్స్ కు కావాల్సిన అంశాలు గట్టిగానే ఉన్నాయి అని అర్థమవుతుంది. దర్శకుడు అనిల్ రావిపూడి మంచి ఎంటర్టైన్మెంట్ సీన్స్ ఎలాగైతే తెరపైకి తీసుకువస్తాడో మాస్ సీన్స్ ను కూడా అదే తరహాలో ప్రజెంట్ చేస్తూ ఉంటాడు. ఇక బాలయ్యతో అతను చేస్తున్న మొదటి సినిమా కాబట్టి ఈసారి సరికొత్త ఎంటర్టైన్మెంట్ అలాగే మంచి హై వోల్టేజ్ యాక్షన్ ఉండబోతున్నట్లుగా అర్థమవుతుంది. బాలయ్య బాబు రెండు చేతుల్లో తుపాకులు పట్టుకుని గంభీరంగా దూసుకొస్తున్న విధానం పోస్టర్ను సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా చేసింది. ఇక అక్టోబర్ 19వ తేదీన అంటే అదేరోజు విజయ్ లియో సినిమా కూడా తెలుగు రాష్ట్రాల్లో విడుదల కాబోతోంది. ఆ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న విషయం తెలిసిందే. కాస్త థియేటర్లో విషయంలో అయితే పోటీ నెలకొనే అవకాశం ఉంది. ఎందుకంటే విక్రమ్ సినిమా తర్వాత లోకేష్ కనగరాజుకు తెలుగులో కూడా మంచి డిమాండ్ అయితే పెరుగుతుంది. దానికి తోడు విజయ్ కూడా మెల్లమెల్లగా తన స్పీడ్ పెంచుతున్నాడు. కాబట్టి లియో వర్సెస్ భగవంత్ కేసరి బాక్సాఫీస్ ఫైట్ ఈసారి ఆసక్తికరంగా కొనసాగే అవకాశం ఉంది.

## 'బ్రో' ట్రైలర్ ఆగయా.. మామఅల్లుళ్ల టైమ్ గేమ్!




సరిగ్గా ఇంకో ఆరు రోజుల్లో థియేటర్లు అన్ని దద్దరిల్లిపోతాయన్న సంగతి తెలిసిందే. టాక్ తో సంబంధం లేకుండా ఆయన క్రేజ్‌తో ఫస్ట్ డే సందడే సందడి ఉంటుంది. ఇక పాజిటివ్ టాక్ వస్తే .. బాక్సాఫీస్ బద్దలే. అర్థమైపోయి ఉంటది కదా.. అదే పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'బ్రో' చిత్రం. రిలీజైన టీజర్, సాంగ్స్ మెగా అభిమానులను అంతగా ఎట్రాక్ట్ అయితే చేయలేదు. ఇక ఇప్పుడు అందరి ఫోకస్ ట్రైలర్ మీద పడింది. మామా అల్లుళ్లు కలిసి తొలిసారి నటించడంతో సినిమాపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇక విడుదల తేదీ దగ్గర పడడంతో తాజాగా మేకర్స్ మూవీ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేసి అభిమానుల్లో ఫుల్ జోష్ ను నింపారు. 'భస్మాసురుడు అని ఒకడు ఉండేవాడు తెలుసా? మీ మనుషులు అందరూ వాడి వారసులు. ఎవడి తల మీద వాడే పెట్టుకుంటాడు. ఎవ్వడికీ ఛాన్స్ ఇవ్వడు' అని పవన్ కళ్యాణ్ చెప్పే డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తర్వాత సాయి తేజ్ ను.. టైమ్ లేదు టైమ్ లేదు అంటూ చూపించారు. అతడి ప్రేయసిగా కేతికా శర్మను చూపించారు. తేజ్... టైమ్ లేదు.. టైమ్ లేదు అంటూ ఫ్యామిలీని, ఫ్రెండ్స్ ను, ఆఖరికి ప్రేమించిన అమ్మాయిని కూడా వదిలేసి.. జీవితంలో పరుగులు పెడుతూ జీవిస్తుంటాడు. అదే సమయంలో అతనికి రోడ్డు ప్రమాదం జరిగుతుంది. సరిగ్గా అప్పుడే అతడికి కాలం విలువ తెలియజేయడం కోసం టైమ్ దిగొస్తాడు. అతడే పవన్ కల్యాణ్. ప్రతిదానికీ టైమ్ లేదంటావ్ కదా అదే నేను అంటూ పవన్ ను చూపించారు. ఓ రోడ్డు ప్రమాదం హీరో జీవితంలో ఎటువంటి మార్పులు తీసుకొచ్చింది? అనే కథాంశంతో సినిమాను తీర్చిదిద్దారని అర్థమవుతోంది. ఇక ప్రచార చిత్రంలో చివర్లో పవన్ మేనరిజం డైలాగ్ లు, హుషాలు తెప్పించే మార్క్ కామెడీ చేశారు. అయితే 'జల్సా' చిత్రంలోని ఐకానిక్ స్టెప్ ను పవన్ మరోసారి చేయడం హైలైట్ గా నిలిచింది. ఇక తమన్ సంగీతం సినిమాకు హైలైట్ గా నిలిచింది. మొత్తానికి ఈ ప్రచార చిత్రం పవన్ మార్క్ మేనరిజం, సాయితేజ్ కామెడీ, ఎమోషనల్, ఫైటింగ్ సీక్వెన్స్ తో నిండి ఉంది. మరి ఈ చిత్రంతో మామఅల్లుళ్లు స్క్రీన్ పై ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ఇకపోతే ఈ చిత్రాన్ని యాక్టర్ కమ్ డైరెక్టర్ సముద్రఖని తెరకెక్కించారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ మాటలు అందించారు. ప్రియా ప్రకాశ్ వారియర్ మరో హీరోయిన్ గా నటించింది.

## జెనిలియాని మనోళ్లు అంత మాట అన్నారా?

దక్షిణాది అభిమానులు హీరోయిన్లను ఎలా ఆదరిస్తారో చెప్పాల్సిన పనిలేదు. రాష్ట్రం..భాషతో సంబంధం లేకుండా తెరపై కనిపిస్తే చాలు గుండెల్లో పెట్టుకుని ఆరాదిస్తారు. హీరోయిన్లకు అవకాశాల రావడం వెనుక ప్రధాన కారణం కేవలం ఫాలోయింగ్ మాత్రమే. అది ఎలా సాద్యమైంది అంటే అభిమానం చూపించడం వల్లే సాధ్యమైంది. తెరపై కనిపించిన ప్రతీ ఒక్కరినీ అదరించడం అన్నది సౌత్ లో ఉన్న ప్రత్యేకత. అందులోనూ తెలుగు రాష్ట్రాల్లో అదే అభిమానం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. నటుడు..నటి నచ్చారంటే? తమ బిడ్డల్లాగే ఆదరించేంత అభిమానం తెలుగు రాష్ట్రాల్ని మించి ఎక్కడా కనిపించదు. దినదినాన అభమానం పెరుగుతుందే తప్ప! తగ్గుతుంది అన్న సన్నివేశం ఎక్కడా చోటు చేసుకోలేదు. అందులోనూ జెనిలియాని తెలుగు అభిమానులు ఎంతగా



ఆదరించారో తెలిసిందే. బొమ్మరిల్లు ఎంతో మంది హృదయాల్లో ఇల్లు కట్టిన అమ్మడికి ఇక్కడ ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంది. జెనిలియా అంతే హైహార్ట్ ఫ్యాన్స్ ఎంతో మంది ఉన్నారు. టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి అభిమానం పై జెనిలియా నీళ్లు జల్లేసింది. దక్షిణాది నటీనటులకు నమ్మకమైన అభిమానులుంటారు. కానీ నేను తెలుగు..తమిళ..మలయాళ భాషల్లో నటిస్తున్నప్పుడు బాలీవుడ్ నుంచి వచ్చి దక్షిణాది సినిమాలు చేస్తుంది అనేవారు. ఎక్కడో నాపై చిన్న చూపు చూపించినట్లు అనిపించేది. భాషా బేధం చూపించినట్లు నా మనసుకు చాలా సందర్భాల్లో అనిపించింది. అయినా సరే నాకు ఆ భాషల్లో సినిమాలు చేయడం ఇష్టం. ఇప్పటివరకూ ఎన్నో సినిమాలు చేసాను. వాళ్ల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఏ భాషలో సినిమాలు రిలీజ్ అయిన వాటిని భారతీయ చిత్రాలుగానే పరిగణిస్తాను. నాకు మాత్రం ఎలాంటి బేధాభిప్రాయాలు లేవు. అందర్నీ సమానంగా చూడటమే తెలుసంటూ చురకలు వేసింది. మరి జెనీలియాకి సౌత్ అభిమానులు అంతగా ఏ సందర్భంలో నొప్పించారో. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత జెనిలియా కొన్నాళ్లకి నటుడు రితేష్ దేశ్ ముఖ్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు కలరు.

## పూజా హెగ్డే మళ్లీ లైన్ లోకి వచ్చినట్లేనా?

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న అందాల భామ పూజ హెగ్డే. ముకుంద సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ చిన్నది దువ్వాడ జగన్నాథమ్ మూవీతో బ్లాక్ బాస్టర్ అందుకొని స్టార్ హీరోయిన్ రేస్ లోకి వచ్చింది. తర్వాత వరుసగా పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ కమర్షియల్ హీరోయిన్ గా తన సక్సెస్ ని కొనసాగించింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అరవింద సమేత, అల వైకుంఠపురంలో సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్ హిట్స్ ని పూజా హెగ్డే తన ఖాతాలో వేసుకుంది. తమిళంలో ఇళయ దళపతి విజయ్ హీరోగా తెరకెక్కిన బీస్ట్ చిత్రంలో కూడా హీరోయిన్ గా నటించిన సక్సెస్ అందుకుంది. అయితే హిందీలో మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో సక్సెస్ రావడం లేదని చెప్పాలి. రణవీర్ సింగ్ కి జోడిగా నటించిన సర్కస్ మూవీ డిజాస్టర్ అయింది. సల్మాన్ ఖాన్ తో చేసిన కిసికి జాన్ కిసిక భాయ్ సినిమా కూడా ఫ్లాప్ జాబితాలో చేరిపోయింది. ఇదే సమయంలో తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేయాల్సిన గుంటూరు కారం సినిమా కాన్సెప్ట్ మారిపోవడంతో పూజా హెగ్డేని



పక్కన పెట్టారు. ఆమె స్థానంలో శ్రీలీలని ఎంపిక చేశారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి జోడిగా చేయాల్సిన ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ చాన్స్ కూడా మిస్ అయింది. ఇక్కడ కూడా పూజా హెగ్డే ప్లేస్ ని శ్రీలీల రీప్లేస్ చేసింది. ఇలా రెండు పెద్ద హీరోల సినిమాలను పూజా హెగ్డే మిస్ చేసుకోవడం వరుస ఫ్లాప్ లతో సతమతం అవుతూ ఉండడంతో కెరియర్ పరంగా డోలమానంలో పడింది. ఇప్పుడు మరలా వరుస ప్రాజెక్టులతో పూజ హెగ్డే బిజీ కావడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తుంది. రెమ్యూనరేషన్ ఎక్కువ డిమాండ్ చేయడంతో పవన్ కళ్యాణ్, మహేష్ బాబు సినిమాలలో అవకాశాలను పూజ హెగ్డే కోల్పోయింది అనే ప్రచారం ఉంది. ప్రస్తుతం మరో మెగా హీరో సాయిధరమ్ తేజ్, సంపత్ నంది కాంబినేషన్ లో తెరకెక్కపోయే మాస్క్ కమర్షియల్ సినిమాలో హీరోయిన్ గా పూజ హెగ్డేని ఫైనల్ చేశారంట. అలాగే మాస్ మహారాజ్ రవితేజ, గోపీచంద్ కాంబినేషన్ లో రాబోయే నాలుగో చిత్రంలో పూజ హెగ్డేని హీరోయిన్ గా ఖరారు చేసినట్లు తెలుస్తుంది. వీటితోపాటు తమిళంలో కార్తీ, లింగస్వామి కాంబినేషన్ లో తెరకెక్కబోయే పయ్యాన్ 2 మూవీలో కూడా హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది.




# భాజపా తలపెట్టిన ధర్నాకు తెలంగాణ హైకోర్టు అనుమతి

హైదరాబాద్: అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న తెలంగాణ భాజపా తలపెట్టిన ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలంటూ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు ఇందిరాపార్కు వద్ద భాజపా ధర్నాకు పిలుపునిచ్చింది. ఈనెల 14న, 20న ధర్నాకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసినప్పటికీ పోలీసులు అనుమతి ఇవ్వలేదని భాజపా తరఫున ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్ కుమార్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ధర్మాసనం అత్యవసర విచారణ జరిపారు. ధర్నా చౌక్ వద్ద ధర్నాకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని పోలీసులను ధర్మాసనం ప్రశ్నించింది. ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయని.. 1000 మంది ధర్నాలో పాల్గొంటే ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అధికార పార్టీ కూడా ధర్నాలు చేసిన సందర్భాలున్నాయని.. అలాంటప్పుడు మాత్రం అభ్యంతరాలు ఎందుకు రావని హైకోర్టు వ్యాఖ్యానించింది. ధర్నాలో 500 మందికి మించి పాల్గొనరాదని.. ఆ మేరకు పోలీసులకు లిఖితపూర్వక హామీ ఇవ్వాలని భాజపాకు హైకోర్టు సూచించింది. ఎలాంటి ర్యాలీలు నిర్వహించవద్దని.. ధర్నాకు హాజరయ్యే ముఖ్య నేతల వివరాలు పోలీసులకు ముందుగానే సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం.. భాజపా ర్యాలీకి అనుమతివ్వాలని హైదరాబాద్ సీపీని ఆదేశించింది.





# 'మన చెత్త - మన బాధ్యత'.. సిద్దిపేటలో చెత్త ఎత్తిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట: చెత్త ఏరివేతతో స్వచ్ఛ పట్టణాన్ని సాధించవచ్చంటూ మరో సంస్కరణకు సిద్దిపేట మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. ఈమేరకు జిల్లాలో నిర్వహించిన 'నడకతో ఆరోగ్యం, చెత్త ఏరివేతతో స్వచ్ఛ పట్టణం' కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. వీధుల్లో నడుస్తూ చెత్త ఏరారు. మురుగుకాల్వల్లోని ప్లాస్టిక్ వస్తువులను మంత్రి స్వయంగా తొలగించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను ప్రజలు పాటించాలని హరీశ్ కోరారు. 'మన చెత్త - మన బాధ్యత' అంటూ ప్రచారం చేశారు. చెత్త వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. మరోవైపు యోగా చేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటామని, క్రమపద్ధతిలో చేస్తే జీవితకాలం పెరుగుతుందని హరీశ్‌రావు అన్నారు. జిల్లాలోని ఓ పాఠశాలలో నిర్వహించిన ఆనంద యోగా క్యాంప్ కార్యక్రమానికి హాజరై 100 మంది సాధకులకు మ్యాట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని వార్డుల వారీగా 10 రోజులు ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.

# కీలక అంశాలపై సచివాలయంలో సీఎం కేసీఆర్ సమీక్ష



హైదరాబాద్: సచివాలయంలో సీఎం కేసీఆర్ బిజిబిజీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. వరుసగా గత నాలుగు రోజుల నుంచి ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు వస్తున్నారు. ఈనెల 21, 22, 23న సీఎం సచివాలయానికి వచ్చారు. సోమవారం కూడా సీఎం కేసీఆర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఇప్పటికే వివిధ శాఖల వారిగా సీఎం రివ్యూస్ నిర్వహించారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపు, వీఆర్ఏల క్రమబద్ధీకరణ, మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం వంటి అంశలపై కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి సీఎస్, ఆయా శాఖల అధికారులు, అందుబాటులో ఉన్న మంత్రులు హాజరయ్యారు.

# పీవీ మార్గ్‌లో వినూత్నంగా మంత్రి కేటీఆర్ బర్త్‌డే సెలబ్రేషన్స్





హైదరాబాద్ : మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం పీవీ మార్గ్ లోని థ్రిల్ సిటీ థీమ్ పార్క్ లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో వినూత్నంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రపంచ రికార్డ్ సాధించిన రూబిక్స్ క్యూబ్ ఆర్టిస్ట్ ఇర్ఫాన్ కుట్టి కండ్లకు గంతలు కట్టుకొని రూబిక్ క్యూబ్స్ తో రూపొందించిన KTR చిత్రం, HAPPY BIRTH DAY KTR ANNA విషెస్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు ఇర్ఫాన్ కుట్టి ని సత్కరించి అభినందించారు. అదేవిధంగా గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా ఒకొక్కరికి 10 లక్షల రూపాయల రిక్స్ కవరేజ్ తో వివిధ ఛానళ్లకు చెందిన వెయ్యి మంది వీడియో జర్నలిస్ట్ లకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్ లను మంత్రుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా థ్రిల్ సిటీ థీమ్ పార్క్‌లో గల వరల్డ్ బిగ్గెస్ట్ త్రీడీ స్క్రీన్ లో మంత్రి %ఖు=% కు విషెస్ తెలియజేస్తూ రూపొందించిన వీడియో ను వీక్షించారు. అదేవిధంగా %ఖు=% పనితీరు, వ్యక్తిత్వం, సాధించిన విజయాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక సాంగ్ ను ప్రదర్శించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ కేక్ ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, ఎగ్గే మల్లేశం, స్టీఫెన్ సన్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్ లు గజ్జెల నగేష్, కోలేటి దామోదర్ గుప్తా, అనిల్ కుమార్ కూర్మాచలం, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, నగర గ్రంథాయల సంస్థ చైర్మన్ ప్రసన్న, కార్పొరేటర్లు హేమలత, టి.మహేశ్వరి, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, తరుణి, సీనియర్ నాయకులు క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులుగా వీఆర్ఏలు.. ఉత్తర్వులు జారీచేసిన సీఎస్



హైదరాబాద్: తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు చిహ్నంగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం వీఆర్ఏలుగా పనిచేస్తున్న అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగానే రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 20,555 మంది వీఆర్ఏలను సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరించనున్నారు. సీఎం ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి సోమవారం వీఆర్ఏల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారు. రాష్ట్రంలో వీఆర్ఏల క్రమబద్ధీకరణ, సర్దుబాటు, స్థిరీకరణ అంశాలపై ఆదివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నీరటి, మసూరు, లషర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలుచుకుంటున్న, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ఈ సమావేశంలో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇవాళ విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల కాపీని వీఆర్ఏల జేఏసీ నేతలకు అందజేశారు. దాంతో రాష్ట్రంలోని వీఆర్ఏలు అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ కవితపై అరవింద్ తీవ్ర వ్యాఖ్యలు



జగిత్యాల: ఎమ్మెల్సీ కవితపై మరోసారి బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శలు గుప్పించారు. ప్రపంచ అవినీతిపరురాలు కవిత అంటూ వ్యాఖ్యానించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "నా మీద పోటీ చేసేందుకు కవిత భయపడుతోంది. వేరే అభ్యర్థిని బరిలో ఉంచి నన్ను ఓడిస్తుందట. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే డిప్యూటీ సీఎం సిసోడియా జైలు పాలయ్యారు. ఆయనను చూసేందుకు కవితక్క కూడా పోతాది. అందరూ దేవున్ని మొక్కండి కవిత జైలుకు పోవాలని. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నాకు తండ్రితో సమానం. కానీ కాంగ్రెస్ పని అయిపోయింది." అని అరవింద్ వ్యాఖ్యానించారు.

# మోసం చేయడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడే లేరు



హైదరాబాద్: ప్రజలను మోసం చేయడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "దళితులకు మూడు ఎకరాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. దళితులకు భూమి కొనడానికి భూమి లేదని కేసీఆర్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తీసుకువచ్చారు. కేసీఆర్ అధికారలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్‌గా మార్చారు. దళిత బంధు అనేది హుజూరాబాద్ ఉప ఎన్నికలకు పరిమితం అయింది. ప్రతి నియోజకవర్గంలో 1500 మందికి దళిత బంధు ఇస్తామని చెప్పారు కానీ 2022-23 ఆర్థిక సంవత్సరం దాటినా ఇప్పటి వరకు దళిత బంధు ఇవ్వలేదు. దళిత బంధుకు బడ్జెట్‌లో రూ 17,700 కోట్లు పెడుతున్నట్లు ప్రభుత్వం చెప్పింది. 2023-24 బడ్జెట్‌లో సైతం దళిత బంధుకు రూ.17,700 కోట్లు కేటాయింపులు చేశారు కానీ అమలు చేయలేదు. ఒక్క బీసీకి ఆర్థికంగా సహాయం చేయని ఏకైక ప్రభుత్వం కేసీఆర్ సర్కార్. బీసీల్లో కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే ఆర్థిక సహాయం అని ప్రభుత్వం ప్రకటించింది. బీసీలకు ఆర్థిక సహాయం ఎంతమందికి ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి." అని డిమాండ్ చేశారు. "మైనారిటీ బంధు ఇస్తున్నామని ప్రభుత్వం జీవో జారీ చేసింది. గడిచిన ఐదేళ్ళుగా మైనారిటీ యాక్షన్ ప్లాన్ ఏమైంది?, గతంలో మైనారిటీలకు రూ.80 వేలు ఇస్తామని జీవో ఇచ్చారు... ఇప్పుడు లక్ష రూపాయలు ఇస్తామని జీవో ఇచ్చారు. దళితబంధుపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. బీసీ బంధు ఎంతమందికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి. తెలంగాణ రాష్ట్రం వస్తే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని భావించాం. ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుంది. తెలంగాణ కోసం కేసీఆర్ ఒక్కరే త్యాగం చేశారా?, నిరుద్యోగులు, యువత పోరాటం చేస్తేనే తెలంగాణ వచ్చింది. మైనారిటీలను కేసీఆర్ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు." అని ధ్వజమెత్తారు. "బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కిషన్ రెడ్డి అంటున్నారు. ముస్లిం రిజర్వేషన్లు మతపరమైనవి కావు. ముస్లిం మైనారిటీల్లో సామాజికంగా వెనుకబడ్డ వారికి మాత్రమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బలహీన వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతాం. గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేద్దామంటే కేంద్రం సహకరించడం లేదని కేసీఆర్ చెప్తున్నారు. ప్రత్యేకమైన పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. కేసీఆర్, మోదీ ఇద్దరు అలాయ్ బలాయ్. కానీ కేంద్ర సహకరించడం లేదని కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేంద్రం సహకరించకపోతే 2020 వరకు మోదీని కేసీఆర్ ఎందుకు సపోర్ట్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను కేసీఆర్ ఎందుకు తీసుకురాలేక పోయారు. కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లును కేసీఆర్ సమర్థించారు." అని జీవన్‌రెడ్డి తెలిపారు.

# అంబేద్కర్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం : మంత్రి జగదీష్ రెడ్డి



యాదాద్రి భువనగిరి : జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం మంత్రి జగదీష్ రెడ్డిని కలిసి అంబేద్కర్ భవన నిర్మాణ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ భవన నిర్మాణానికి గాను మంజూరు అయిన రెండు కోట్ల నిధుల నుంచి కోటి 40 లక్షలు వ్యయం చేసి నిర్మాణం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన రూ 40 లక్షల తో పాటు అవసరమైన నిధులు మంజూరు చేసి అంబేద్కర్ భవనాన్ని పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంబేద్కర్ రూపొందించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు.

# కేటీఆర్ బర్త్‌డే..నిరుపేద మహిళకు ఇంటిని గిఫ్ట్‌గా ఇచ్చిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్



పెద్దపల్లి : సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం.. యువత భవిష్యత్తుకు 'తారక'మంత్రం.. నేటి రాజకీయాల్లో పర్ఫెక్ట్ లీడ కేటీఆర్ జన్మదిన వేడుకలు నేడు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దేశ, విదేశాల్లో ఘనంగా జరపుకుంటున్నారు. అయితే ప్రముఖులు, ముఖ్య నాయకుల జన్మదిన వేడుకలంటే సహజంగా అట్టహాసంగా జరుపుకొంటారు. కానీ, మంత్రి కేటీఆర్ మాత్రం అందుకు విభిన్నం. ప్రచార ఆర్భాటాలకయ్యే ఖర్చులు అభాగ్యులు, అసహాయులు, నిరుపేదల అభ్యున్నతి కోసం వెచ్చించాలని కార్యకర్తలకు తరుచూ చెప్తుంటారు. ఒకసారి తన బర్త్‌డేకి మొక్కలను నాటాలని, మరోసారి 'గిఫ్ట్ ఏ స్మైల్'కు పిలుపునిస్తారు. కేటీఆర్ పిలుపు మేరకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మానవీయంగా స్పందించారు.

**ఎమ్మెల్యే నిర్మించిన ఇల్లు..** మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా ఓ నిరుపేదరాలికి ఇల్లు కట్టి గిఫ్ట్ గా అందించారు. సోమవారం అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో నూతన ఇల్లును పేద ఒంటరి మహిళ గాదెం రాజమ్మకు అందించడంతో పలువురు ఎమ్మెల్యే పనితీరుపై ప్రశంసలు కురిపించారు.

# సత్తుపల్లి అభ్యర్థిని ప్రకటించే దమ్ము ఉందా?.. పొంగులేటిపై సండ్ర ఘాటు వ్యాఖ్యలు



ఖమ్మం: కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2023కు ముందు తెలంగాణ రాష్ట్రంలో కనిపించిన అభివృద్ధి... 2023 జనవరి నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కనిపించడం లేదా? అంటూ ప్రశ్నించారు. "ఏ అధికారం లేని నువ్వు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఎస్కార్ట్ వాడావు?. ఏ అధికారం ఉందని నిన్ను కేసీఆర్, కేటీఆర్‌లు హెలికాప్టర్‌లో తిప్పారు? .. ఏ అధికారం ఉందని నీ ఇంటి ముందు గార్డ్స్‌ను పెట్టుకున్నావు, నలుగురు గన్ మెన్‌లను వాడావు?... ఇన్ని అనుభవించిన నువ్వు నన్ను దొర అనడం హాస్యాస్పదం?.. దళితులు ఎవ్వరూ వ్యాపారాలు చేయకూడదా?.. నువ్వు మాత్రమే వ్యాపారాలు చెయ్యాలా?. దళితులు ఎదిగితే ఓర్వలేవా ఎందుకు నీకింత అహంకారం. సత్తుపల్లిలో నాలుగు కాంగ్రెస్ క్యాంప్ ఆఫీస్‌లు తీసేసి ఒకటి పెట్టి నడిపించగల సత్తా ఉందా. కేసీఆర్ నన్ను సత్తుపల్లి అభ్యర్థిగా ప్రకటించారు. నీకు నీ అభ్యర్థిని ప్రకటించే దమ్ము ఉందా" అంటూ సండ్ర వెంకట వీరయ్య తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com